డైనమిక్
# జనం వాయిస్
RNI NO: TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక
DYNAMIC JANAMVOICE
WWW.JANAMVOICE.COM
TG - AP HYDERABAD RANGAREDDY KARIMNAGAR KHAMMAM WARANGAL ADILABAD NIZAMABAD NALGONDA MEDAK MAHABOOBNAGAR

విలేకరులు కావలెను..
రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనాత్మకమైన వార్త కథనాలతో వెలువడుతున్న డైనమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక కు విలేకరులు కావలెను.అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత... కొత్త వారికి అవకాశం..
సంప్రదించండి: 8121158069

| పెద్దపల్లి Peddapalli | గురువారం Thursday | 16 - 04 -2026 16 - 04-2026 | సంపుటి: 01 Volume: 01 | సంచిక: 87 Issue: 87 | పేజీలు: 10 Pages: 10 | వెల: 02/- Cost :02/- |
|---|---|---|---|---|---|---|



## తెలంగాణపై నిప్పుల వాన

- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ.
- 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు.. రానున్న మూడు రోజులు గడ్డుకాలమే.
- నిజామాబాద్, ఖమ్మం సహా పలు ప్రాంతాల్లో వడగాలుల తీవ్రత.
- ఎండల ధాటికి అల్లాడుతున్న రాష్ట్రం.. జాగ్రత్తలు తప్పనిసరి.

**జనం వాయిస్, హైదరాబాద్, ఏప్రిల్ 15:**
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎండలు భగభగలాడుతున్నాయి. భానుడి భగభగలకు రాష్ట్రం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు ఇప్పటికే 43 డిగ్రీల మార్కును దాటగా, రానున్న మూడు రోజుల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉండబోతోందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్ నగర్, నిజామాబాద్, ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజ్‌గిరి మరియు హైదరాబాద్ జిల్లాలకు వాతావరణ శాఖ 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసింది. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని అధికారులు సూచిస్తున్నారు. రానున్న మూడు రోజుల్లో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా ఒకటి నుంచి రెండు డిగ్రీల మేర పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆయా జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే అవకాశం ఉంది. ఎండ తీవ్రతతో పాటు వడగాలులు కూడా తోడవడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం 11 గంటల నుంచే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. రాబోయే 72 గంటల పాటు రాష్ట్రంలో వడగాల్పుల

- మిగతా 2 లో...

# కాంగ్రెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై జీవన్ రెడ్డి ధ్వజం

ఎమ్మెల్యేలకు అపాయింట్ మెంట్ ఇవ్వడం లేదని ఆరోపణ.
కేసీఆర్ వ్యక్తిత్వంపై ప్రశంసలు కురిపించిన మాజీ మంత్రి.
పార్టీ సూచనలు కాకుండా ప్రభుత్వం చెప్పినట్లే పార్టీ నడుస్తోందని విమర్శ.



**జనం వాయిస్, హైదరాబాద్, ఏప్రిల్ 15:**
తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనితీరుపై ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన, కాంగ్రెస్ పార్టీపై హైకమాండ్ పట్టు కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డికి సంబంధించిన 'ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ'గా మారిపోయిందని ఆయన ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న ఏకపక్ష ధోరణి వల్ల పార్టీ మనుగడకే ప్రమాదం ఏర్పడిందని ఆయన హెచ్చరించారు. పార్టీలో ప్రజాస్వామ్యం కరువైందని, కనీసం ఎమ్మెల్యేలకు కూడా ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ లభించడం లేదని జీవన్ రెడ్డి ఆరోపించారు. సాధారణంగా పార్టీ తీసుకునే విధానపరమైన నిర్ణయాల మేరకు ప్రభుత్వం నడుస్తుందని, కానీ ఇప్పుడు పరిస్థితి తలకిందులైందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం చెప్పినట్లుగా పార్టీ నడుస్తోందని, రేవంత్ రెడ్డి నిర్ణయాల వల్ల కాంగ్రెస్ పార్టీ అస్తిత్వం దెబ్బతింటోందని

- మిగతా 2 లో...

## మహిళా రిజర్వేషన్‌కు మద్దతు.

- పునర్విభజనపై ససేమిరా ఎ కేసీఆర్ స్పష్టీకరణ
- ఎర్రవెల్లి నివాసంలో కేటీఆర్, హరీశ్ రావులతో కేసీఆర్ కీలక భేటీ.
- దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తి లేదు.
- ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ వేడుకల నిర్వహణపై దిశానిర్దేశం.

2



## విద్యుత్ ఆర్టిజన్ కార్మికులకు బీజేపీ మద్దతు

- నిరసన శిబిరాన్ని సందర్శించిన రామ్‌చందర్ రావు.
- డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి.
- కార్మికుల హక్కుల కోసం పోరాటానికి హామీ.



2

## 'వర్ణ మైత్రి' చిత్రకళ ప్రదర్శన



02

## గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి

- ఖమ్మం లో అభివృద్ధి పనులకు శ్రీకారం.
- విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన.
- 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రారంభం.
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటన.

02



## బలవంతపు భూసేకరణకు వ్యతిరేకం

- పరిగి ఇండస్ట్రియల్ కారిడార్‌పై రైతుల ఆందోళన.
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత మద్దతు.
- బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా ధర్నా.
- కవిత, విశారదన్‌పై పోలీసులతో వాగ్వాదం.

02



## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

480 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రాల పంపిణీ.
కళ్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన మంత్రి.
అంగన్‌వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్ల పంపిణీ.

02



# తెలంగాణపై నిప్పుల వాన

**- మొదటిపేజీ తరువాయి...** ప్రభావం స్పష్టంగా కనిపిస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈరోజు నిజామాబాద్, ఖమ్మం, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. అలాగే గురువారం ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నాగర్ కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలుల తీవ్రత అధికంగా ఉంటుందని తెలిపింది. వడగాలులు వీచే అవకాశం ఉన్న జిల్లాలకు వాతావరణ శాఖ 'ఎల్లో అలర్ట్' జారీ చేసింది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు మరియు గర్భిణులు ఎండల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని, శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా చూసుకోవాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. వడదెబ్బ తగలకుండా కాటన్ దుస్తులు ధరించాలని, బయటకు వెళ్లేటప్పుడు గొడుగు లేదా టోపీ వంటివి ధరించాలని సూచిస్తున్నారు. ప్రభుత్వం కూడా ప్రధాన జంక్షన్ల వద్ద మంచినీటి చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని స్థానిక సంస్థలను ఆదేశించింది. ఎండల తీవ్రతతో విద్యుత్ వినియోగం కూడా రికార్డు స్థాయిలో పెరుగుతోంది. వాతావరణంలో సంభవిస్తున్న ఈ మార్పుల వల్ల వ్యవసాయ పనులపై కూడా ప్రభావం పడుతోంది. ఎండలు ముదురుతుండటంతో పశువుల సంరక్షణ విషయంలో కూడా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ సూచించింది. ఈ నెల చివరి నాటికి ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని, ఈ వేసవి కాలంలో ముందస్తు జాగ్రత్తలే ప్రాణరక్షణకు మార్గమని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఎండల తీవ్రతపై వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు బులెటిన్లను విడుదల చేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తోంది.

# విద్యుత్ ఆర్టిజన్ కార్మికులకు బీజేపీ మద్దతు

**జనం వాయిస్, హైదరాబాద్, ఏప్రిల్ 15:**
తెలంగాణ విద్యుత్ సంస్థల్లో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత కొన్ని రోజులుగా పోరాడుతున్న విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల నిరసన శిబిరాన్ని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామ్‌చందర్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. శ్రమజీవుల కష్టాలను గుర్తించి తగిన న్యాయం చేయాలని సూచించారు. కార్మికుల డిమాండ్లు న్యాయమైనవేనని పేర్కొంటూ వారికి సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. కార్మికుల హక్కుల సాధన కోసం బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉద్యమం మరింత ఉద్ధృతం అయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలని సూచించారు. కార్మికుల శ్రమతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అన్నారు. వారి సంక్షేమం కోసం తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. శ్రమజీవుల పక్షాన బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని రామ్‌చందర్ రావు స్పష్టం చేశారు. కార్మికులతో కలిసి వారి హక్కుల సాధన వరకు పోరాడతామని తెలిపారు.

# గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి

**జనం వాయిస్, ఖమ్మం, ఏప్రిల్ 15:**
తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు మండలంలో విస్తృత పర్యటన నిర్వహించి పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధిని వేగవంతం చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. పర్యటనలో భాగంగా నారాయణపురం గ్రామంలో రూ.2 కోట్ల 75 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. ఈ ఉపకేంద్రం ద్వారా ప్రాంతీయంగా విద్యుత్ సరఫరా సామర్థ్యం పెరగడంతో పాటు వోల్టేజ్ సమస్యలు తగ్గుతాయని అధికారులు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ అవసరాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో, ఇలాంటి ఉపకేంద్రాల నిర్మాణం కీలకమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రైతులకు, గృహ వినియోగదారులకు నిరంతర విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ పూర్తి కావడంతో పరిసర గ్రామాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. అనంతరం కల్లూరు మండల కేంద్రంలో వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో రూ.10 కోట్ల 50 లక్షల వ్యయంతో నిర్మించిన 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఈ ఆసుపత్రి ద్వారా గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. దూరప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే చికిత్స పొందే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఆసుపత్రిలో ఆధునిక వైద్య పరికరాలు, అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేసి సేవలను మరింత మెరుగుపరచాలని అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి ముఖ్య ప్రాధాన్యమని, ప్రతి ఒక్కరికీ సమానంగా వైద్య సేవలు అందించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, పోలీసు కమిషనర్ సునీల్ దత్, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి దయానంద్, రాందాసు నాయక్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, మౌలిక వసతుల బలోపేతం, ప్రజల జీవన ప్రమాణాల పెంపుదల దిశగా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోందని అధికారులు తెలిపారు.

# బలవంతపు భూసేకరణకు వ్యతిరేకం

**జనం వాయిస్, వికారాబాద్, ఏప్రిల్ 15:**
వికారాబాద్ జిల్లా పరిగి ఇండస్ట్రియల్ కారిడార్ కోసం రైతుల భూములను నిర్బంధంగా స్వాధీనం చేసుకుంటున్నారని ఆరోపిస్తూ రైతులు ఆందోళన చేపట్టారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట నడి ఎండలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ ఆందోళనకు జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ హాజరై మద్దతు తెలిపారు. పోలీసులు ఆందోళనను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో కవిత, విశారదన్‌లతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ పరిశ్రమల పేరుతో చిన్న, సన్నకారు రైతుల భూములను బలవంతంగా లాక్కుంటున్నారని తీవ్రంగా మండిపడ్డారు. కల్లాపూర్, రాపోల్, భట్ల చందారం వంటి గ్రామాల్లో రైతుల భూములను పూర్తిగా స్వాధీనం చేసుకుంటున్నారని ఆరోపించారు. సుమారు 1200 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంటున్నారని, అందులో ఎక్కువ భాగం అసైన్డ్ భూములేనని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతుల భూములు కూడా ఇందులో ఉండటం దురదృష్టకరమని పేర్కొన్నారు. రైతులకు మరో మార్గం లేకుండా పరిస్థితి తీసుకువస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా రైతులు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని కవిత అన్నారు. మద్దతు ధర, రుణమాఫీ, ఎరువుల కొరత వంటి సమస్యలు పరిష్కారం కాకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. బలవంతపు భూసేకరణను నిలిపివేసే వరకు పోరాటం కొనసాగిస్తామని కవిత స్పష్టం చేశారు. రైతుల హక్కుల కోసం జాగృతి, ధర్మ సమాజ్ పార్టీ ఎప్పటికప్పుడు అండగా ఉంటాయని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యమమే మార్గమని పిలుపునిచ్చారు.



# కాంగ్రెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ

**- మొదటిపేజీ తరువాయి...** ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ నాయకులను గౌరవించడం లేదని, పార్టీని రేవంత్ రెడ్డి క్రమంగా ఖతం చేస్తున్నారని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గురించి జీవన్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ తన వయసును గౌరవించి ఎప్పుడూ 'అన్న' అని పిలుస్తారని గుర్తు చేసుకున్నారు. కేసీఆర్‌కు ప్రజలంటే అపారమైన గౌరవం ఉందని, ఆయన వ్యక్తిత్వం రేవంత్ రెడ్డి లాంటిది కాదని ప్రశంసించారు. కేసీఆర్ హయాంలో కనీసం సంప్రదింపులకు అవకాశం ఉండేదని, ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదని ఆయన అభిప్రాయపడ్డారు. రాజకీయాలకు అతీతంగా కేసీఆర్ ఇచ్చే గౌరవం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. తాను బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు వస్తున్న వార్తలపై కూడా జీవన్ రెడ్డి స్పష్టత ఇచ్చారు. తాను ఏ పార్టీలో ఉన్నా ఆఖరి వరకు ప్రజల కోసమే పోరాడతానని స్పష్టం చేశారు. పార్టీ మారుతున్నారా లేదా అనే విషయంపై సూటిగా సమాధానం చెప్పకపోయినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల పట్ల తాను తీవ్ర అసంతృప్తితో ఉన్నానని ఆయన మాటలను బట్టి తెలుస్తోంది. ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రథమ ప్రాధాన్యతని, పదవుల కోసం పాకులాడబోనని ఆయన వెల్లడించారు. జీవన్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో పెద్ద దుమారాన్ని రేపుతున్నాయి. ముఖ్యంగా సొంత పార్టీ ముఖ్యమంత్రిపైనే సీనియర్ నాయకుడు బహిరంగంగా విమర్శలు చేయడం కాంగ్రెస్ శ్రేణులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. రానున్న రోజుల్లో పార్టీ అధిష్టానం ఈ విషయంలో జోక్యం




చేసుకుంటుందా లేదా అనేది వేచి చూడాలి. జీవన్ రెడ్డి వ్యాఖ్యలపై రేవంత్ రెడ్డి వర్గం ఎలా స్పందిస్తుందనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# మహిళా రిజర్వేషన్‌కు మద్దతు.

**జనం వాయిస్, హైదరాబాద్, ఏప్రిల్ 15:**
భారత ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్ మరియు నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తన వైఖరిని స్పష్టం చేశారు. బుధవారం ఎర్రవెల్లిలోని తన నివాసంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావులతో ఆయన సుదీర్ఘంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దేశ, రాష్ట్ర రాజకీయ పరిణామాలతో పాటు పార్లమెంటులో ప్రవేశపెట్టబోయే బిల్లులపై క్షుణ్ణంగా చర్చించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలుపుతూనే, నియోజకవర్గాల పునర్విభజన విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలనేది బీఆర్ఎస్ పార్టీ సుదీర్ఘ కాలపు డిమాండ్ అని కేసీఆర్ గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలోనే అసెంబ్లీలో దీనిపై ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపామని ఆయన వివరించారు. ఈ బిల్లుకు తమ పార్టీ ఎంపీలు బేషరతుగా మద్దతు తెలుపుతారని ప్రకటించారు. మహిళా సాధికారత దిశగా ఇది ఒక గొప్ప అడుగు అని అభివర్ణించిన ఆయన, సామాజిక న్యాయం పాటించే ఏ బిల్లుకైనా బీఆర్ఎస్ ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. అయితే, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లుపై కేసీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన సీట్ల కేటాయింపు జరిగితే, జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం లోక్ సభలో దక్షిణాది రాష్ట్రాలకు ఉన్న 24 శాతం ప్రాతినిధ్యం ఏమాత్రం తగ్గకూడదని డిమాండ్ చేశారు. అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణ వంటి రాష్ట్రాలకు సీట్లు పెరగాల్సిన చోట, జనాభా లెక్కల పేరుతో అన్యాయం చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. బిల్లులోని ప్రతి క్లాజును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే నియోజకవర్గాల పునర్విభజనపై పార్టీ తుది నిర్ణయం తీసుకుంటుందని కేసీఆర్ నేతలకు సూచించారు. అప్పటి వరకు తొందరపాటు వ్యాఖ్యలు చేయవద్దని కోరారు. దక్షిణాది రాష్ట్రాల ఎంపీలు, నాయకులతో ఈ విషయంలో సమన్వయం చేసుకుని ఉమ్మడి పోరాటం చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఉత్తరాది రాష్ట్రాలకు లాభం చేకూర్చేలా, దక్షిణాదిని వెనుకబాటుకు గురిచేసేలా ఏ నిర్ణయం ఉన్నా పార్లమెంటులో అడ్డుకుంటామని ఆయన స్పష్టం చేశారు. పార్టీ భవిష్యత్ కార్యక్రమాలపై కూడా కేసీఆర్ ఈ భేటీలో దిశానిర్దేశం చేశారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కేటీఆర్, హరీశ్ రావులను కోరారు. అలాగే ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. మండుతున్న ఎండల దృష్ట్యా సభలకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని, గ్రామ స్థాయి నుండి పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన సూచించారు. ఈ భేటీతో బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

**జనం వాయిస్, మంథని, ఏప్రిల్ 15:**
రాష్ట్రంలోని అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ అభివృద్ధి ఫలాలను అందించడమే కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. బుధవారం మంథని నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పథకాల కింద ఎంపికైన లబ్ధిదారులకు ప్రభుత్వ సాయాన్ని అందజేస్తూ, నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడంలో తమ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని భరోసా ఇచ్చారు. ముఖ్యంగా మంథని మున్సిపాలిటీతో పాటు మంథని, ముత్తారం, కమాన్ పూర్, రామగిరి మండలాలకు చెందిన 480 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రాలను మంత్రి శ్రీధర్ బాబు అందజేశారు. ఏళ్ల తరబడి సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు ఈ పథకం ఒక వరమని ఆయన పేర్కొన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సకాలంలో ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గవ్యాప్తంగా దశలవారీగా అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. సంక్షేమ పథకాల అమలులో భాగంగా 129 మంది ఆడబిడ్డల పెళ్లిళ్లకు కళ్యాణ లక్ష్మి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన 169 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.





1.84 కోట్ల రూపాయల విలువైన చెక్కులను అందజేశారు. పేదల కష్టకాలంలో ప్రభుత్వం అండగా ఉంటుందని, వైద్యం కోసం ఎవరూ అప్పుల పాలు కాకూడదనే ఉద్దేశంతో సీఎంఆర్ఎఫ్ నిధులను త్వరితగతిన మంజూరు చేస్తున్నామని మంత్రి వివరించారు. విద్య వైద్య రంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్న అంగన్‌వాడీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని 160 మంది అంగన్‌వాడీ టీచర్లకు మంత్రి శ్రీధర్ బాబు స్మార్ట్ మొబైల్ ఫోన్లను అందజేశారు. ఇకపై అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ, సమాచార సేకరణ మరియు రిపోర్టింగ్ ప్రక్రియ డిజిటల్ విధానంలో సులభతరం అవుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గర్భిణులు, బాలింతలు మరియు చిన్నారులకు నాణ్యమైన సేవలు అందించాలని టీచర్లకు సూచించారు. మంథని నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని, అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదని మంత్రి స్పష్టం చేశారు. అర్హత ఉండి పథకాలు అందని వారుంటే నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా, పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు మరియు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. మంత్రి పర్యటనతో మంథని నియోజకవర్గంలో పండుగ వాతావరణం నెలకొంది.

# 'వర్ణ మైత్రి' చిత్రకళ ప్రదర్శన ప్రారంభం

జనం వాయిస్, హైదరాబాద్, ఏప్రిల్ 15:
తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ముఖ్య అతిథిగా 'వర్ణ మైత్రి: రుమాలే చెన్నవసవయ్య చిత్రాల ప్రతిప్రదర్శన'ను ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రదర్శనను హైదరాబాద్‌లోని సాలార్ జంగ్ మ్యూజియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సాలార్ జంగ్ మ్యూజియం మరియు రుమాలే ఆర్ట్ హౌస్ సంయుక్తంగా ఏర్పాటు చేశాయి. కళాభిమానులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ ప్రదర్శనను సందర్శించారు. చిత్రకళపై ఆసక్తి ఉన్న వారికి ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రుమాలే చెన్నవసవయ్య చిత్రాల్లో భారతీయ సాంస్కృతిక విలువలు, సంప్రదాయ కళా వైభవం ప్రతిబింబిస్తున్నాయని గవర్నర్ అభిప్రాయపడ్డారు. ఆయన కృతులు కళా ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు పొందినవని కొనియాడారు. ఈ ప్రదర్శనలో వివిధ దశల్లో రూపొందించిన చిత్రాలను ప్రదర్శించారు. ప్రతి చిత్రంలో రంగుల సమన్వయం, భావ వ్యక్తీకరణ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. కళాకారుని సృజనాత్మకతకు ఇది నిదర్శనమని సందర్శకులు అభిప్రాయపడ్డారు. కళా ప్రదర్శనలు సమాజంలో సృజనాత్మకతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అధికారులు తెలిపారు. యువ కళాకారులకు ఇవి ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ



ప్రదర్శన కొద్ది రోజుల పాటు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కళాభిమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రదర్శనను సందర్శించాలని సూచించారు.

# పీర్జాదిగూడలో బీఆర్ఎస్‌లోకి కౌన్సిలర్ల చేరిక

**జనం వాయిస్, మేడ్చల్, ఏప్రిల్ 15:**
మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని వారికి స్వాగతం పలికారు. స్థానిక నాయకులకు అభినందనలు తెలియజేస్తూ పార్టీ బలోపేతంపై విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ లోక్‌సభ, శాసనసభ సీట్ల పెంపుపై కేంద్ర ప్రభుత్వం చెప్పేది ఒకటి, చేసేది మరొకటని విమర్శించారు. డీలిమిటేషన్ పేరుతో బీజేపీ మరో కొత్త కుట్రకు తెరలేపుతోందని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాల హక్కులను కాపాడటంలో బీఆర్ఎస్ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. డీలిమిటేషన్ ప్రక్రియ ద్వారా దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కే ప్రయత్నం జరిగితే సహించబోమని కేటీఆర్ హెచ్చరించారు. అవసరమైతే కేసీఆర్ నాయకత్వంలో పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కేంద్రం తీసుకునే నిర్ణయాలపై



అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. మహిళా సంక్షేమంపై కూడా కేటీఆర్ వ్యాఖ్యానిస్తూ, తమ ప్రభుత్వం మార్కెట్ కమిటీలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించిందని తెలిపారు. శాసనసభలో మహిళా రిజర్వేషన్‌పై తీర్మానం కూడా ఆమోదించామని గుర్తుచేశారు. మహిళల సాధికారతకు బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పిస్తూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోయిందని ఆరోపించారు. రెండున్నర సంవత్సరాలు గడిచినా వాగ్దానాలు నెరవేర్చలేదని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలకు ఇచ్చిన ఆర్థిక సాయం, స్కూటీల వాగ్దానాలపై ప్రశ్నలు లేవనెత్తారు. బీఆర్ఎస్ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తుచేస్తూ, కేసీఆర్ నాయకత్వంలో అనేక కార్యక్రమాలు విజయవంతంగా అమలయ్యాయని కేటీఆర్ తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వంలో అవి నిలిచిపోయాయని విమర్శించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా బీఆర్ఎస్ ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.

# హైదరాబాద్ పరిస్థితులపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

- దోమలు, దొంగలపై ఘాటు వ్యాఖ్యలు.
- భూకబ్జాలు, అభివృద్ధిపై ఆరోపణలు.
- ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్‌కు మద్దతు కోరింపు.



**జనం వాయిస్, హైదరాబాద్, ఏప్రిల్ 15:**
హైదరాబాద్‌లో ప్రస్తుత పరిస్థితులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. నగరంలో ప్రస్తుతం సంతోషంగా ఉన్న వారు ఇద్దరే ఉన్నారని, ఒకరు దొంగలు, మరొకరు దోమలని ఘాటుగా వ్యాఖ్యానించారు. నగరంలో ఎక్కడపడితే అక్కడ భూములు కబ్జాలు జరుగుతున్నాయని కేటీఆర్ ఆరోపించారు. ఒకవైపు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మరోవైపు ముఖ్యమంత్రి పాలనలో ఈ పరిస్థితులు ఏర్పడ్డాయని విమర్శించారు. నగరంలో దోమల సమస్య కూడా అధికంగా ఉందని పేర్కొన్నారు. దోమల సమస్యపై అసెంబ్లీలో కూడా ప్రస్తావించానని, నగరానికి 'దోమలబాదు' లేదా 'దోమలగూడ' అనే పేర్లు పెట్టాలని చెప్పినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్పై అపవాదులు మోపి తప్పించుకోవాలని ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారని కేటీఆర్ అన్నారు. కానీ ప్రజలు నిజాన్ని తెలుసుకుంటారని, ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉప్పల్ ఫ్లైఓవర్ పనులపై కూడా కేటీఆర్ విమర్శలు చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రాజెక్ట్ ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్నప్పటికీ పురోగతి లేదని తెలిపారు. తాము నిర్మించేందుకు సిద్ధమని చెప్పినా ప్రభుత్వం అంగీకరించలేదని ఆరోపించారు. ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని ప్రజలను కేటీఆర్ కోరారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే మళ్లీ బుల్డోజర్ రాజకీయాలు వస్తాయని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేసి తమకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

# వారసత్వ కట్టడాలకు అంతర్జాతీయ మెరుగులు

- పర్యాటక ఆకర్షణే లక్ష్యం: మంత్రి జూపల్లి.
- చార్మినార్, చౌమహల్లా ప్యాలెస్ సందర్శన.
- మచిలీ కమాన్ పునరుద్ధరణకు నిధుల మంజూరు.



**జనం వాయిస్, హైదరాబాద్, ఏప్రిల్ 15:**
రాష్ట్రంలోని వారసత్వ కట్టడాలకు అంతర్జాతీయ స్థాయి హంగులు జోడించి పర్యాటకులను ఆకర్షించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. నగరంలోని ప్రముఖ చారిత్రక కట్టడాలు చార్మినార్, చౌమహల్లా ప్యాలెస్లను సందర్శించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మచిలీ కమాన్ పునరుద్ధరణకు రూ.3.64 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా కట్టడాన్ని పునరుద్ధరించి, పర్యాటకులకు మరింత ఆకర్షణీయంగా మార్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఈ నిర్మాణాలను సంరక్షిస్తూ, ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయడం ద్వారా నగరానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందని మంత్రి తెలిపారు. విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. వారసత్వ కట్టడాల సంరక్షణతో పాటు, వాటి చుట్టూ మౌలిక వసతులు మెరుగుపరిచే చర్యలు కూడా చేపడతామని వెల్లడించారు. ఈ చర్యలతో హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు.

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

హెల్మెట్ తప్పనిసరి.
యువత ప్రాణాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.
ఆదిలాబాద్‌లో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ప్రారంభం.
విపత్తుల కంటే ప్రమాదాల్లోనే ఎక్కువ మరణాలు.



**జనం వాయిస్, ఆదిలాబాద్, ఏప్రిల్ 15:**
రాష్ట్రంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో భారీగా ప్రాణనష్టం సంభవిస్తుండటంపై ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా కుటుంబాలకు వెన్నెముకగా ఉండాల్సిన యువకులు ఈ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన ఉద్ఘాటించారు. సాధారణంగా ఏదైనా ప్రకృతి విపత్తు సంభవించినప్పుడు ఎంతమంది ప్రాణాలు కోల్పోతారో, అంతకంటే ఎక్కువ మంది రోడ్డు ప్రమాదాల వల్ల మరణిస్తున్నారని మంత్రి గణాంకాలతో వివరించారు. ఈ మరణాల వల్ల ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయని, పిల్లలు అనాథలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు కలిగే ప్రాణనష్టం కేవలం ఒక వ్యక్తికే పరిమితం కాదని, అది మొత్తం కుటుంబంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన గుర్తు చేశారు. అందుకే ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని ఆయన కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రవాణా శాఖ మరియు పోలీస్ శాఖ సంయుక్తంగా 'అరైవ్ అలైవ్' వంటి వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయని మంత్రి తెలిపారు. వాహనదారులు ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, వేగ పరిమితిని మించకూడదని సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆయన పిలుపునిచ్చారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాపాయం నుండి 80 శాతం వరకు తప్పించుకునే అవకాశం ఉంటుందని, దీనిని ఒక భారంగా భావించకుండా బాధ్యతగా గుర్తించాలని ఆయన స్పష్టం చేశారు. యువత బైక్ రేసింగ్‌లు మరియు నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ హితవు పలికారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు వాహనాలు ఇచ్చేముందు వారికి భద్రత పట్ల అవగాహన కల్పించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం అనేది జరిమానాల నుంచి తప్పించుకోవడానికి మాత్రమే కాదని, మన ప్రాణాలను మనం కాపాడుకోవడానికేనని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం ఎన్ని చట్టాలు తెచ్చినా, ప్రజల భాగస్వామ్యం మరియు స్వీయ నియంత్రణ లేనిదే ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించడం సాధ్యం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు మరియు పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరిస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. రోడ్డు భద్రతపై ప్రభుత్వం చేపడుతున్న ఈ ప్రచారం నిరంతరం కొనసాగుతుందని, జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని అధికారులు వెల్లడించారు. 'అరైవ్ అలైవ్' లక్ష్యం నెరవేరాలంటే ప్రతి పౌరుడు ట్రాఫిక్ నియమాలను గౌరవించాలని మంత్రి తన ప్రసంగాన్ని ముగించారు.

# తమిళనాడులో కాంగ్రెస్ ప్రచారానికి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వం

- శివకాశిలో కార్యకర్తలతో సమావేశం.
- ఎన్నికల వ్యూహాలపై చర్చలు.
- టీఎన్‌సీసీ నేతల సమక్షంలో ప్రచారం వేగవంతం.



**జనం వాయిస్, శివకాశి, ఏప్రిల్ 15:**
తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారానికి వేగం పెంచింది. ఏఐసీసీ సీనియర్ పరిశీలకుడు, తెలంగాణ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి శివకాశిలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎన్నికల వ్యూహాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు. ప్రతి ఓటరిని చేరుకునేలా ప్రణాళికాబద్ధంగా ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారంపై దృష్టి పెట్టాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎస్.పీ. కృష్ణమూర్తితో పాటు ఇతర రాష్ట్ర నేతలు కూడా పాల్గొన్నారు. నాయకుల సమన్వయంతో ప్రచార కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా పని చేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కార్యకర్తల కృషి, ఐక్యతతో పార్టీ మంచి ఫలితాలు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రచార కార్యక్రమాలు మరింత వేగవంతం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా నాయకులు పర్యటనలు కొనసాగిస్తున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

# మహిళా శక్తికి పట్టం

కేఎంఐటీ వద్ద భారీ బైక్ ర్యాలీ.
నారీ శక్తి వందన్ అధినియంకు మద్దతుగా మహిళల గర్జన.
చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లతో నవ భారత నిర్మాణం.
మహిళా నేతృత్వంలోని అభివృద్ధికి ప్రధాని మోదీ శ్రీకారం.





**జనం వాయిస్, హైదరాబాద్, ఏప్రిల్ 15:**
దేశాభివృద్ధిలో మహిళల పాత్రను మరింత క్రియాశీలం చేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చారిత్రాత్మక 'నారీ శక్తి వందన్ అధినియం'కు మద్దతుగా హైదరాబాద్ నగరంలో మహిళలు పెద్ద ఎత్తున కదిలారు. నగరంలోని కేఎంఐటీ కళాశాల వద్ద బుధవారం ఉదయం నిర్వహించిన ఉత్సాహభరితమైన మహిళల బైక్ ర్యాలీని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వందలాది మంది మహిళలు ద్విచక్ర వాహనాలపై తరలివచ్చి మహిళా సాధికారతకు నినాదాలు చేస్తూ తమ సంఘీభావాన్ని ప్రకటించారు. లోక్‌సభ మరియు రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక కొత్త అధ్యాయం మొదలైందని రాంచందర్ రావు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ చట్టం వల్ల మన దేశ ఆడబిడ్డలు ఇకపై కేవలం ఓటర్లుగానే కాకుండా, నవ భారత విధాన నిర్ణేతలుగా చారిత్రక పాత్ర పోషించనున్నారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గత కొన్ని దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ




రిజర్వేషన్ బిల్లును అమలులోకి తీసుకురావడం ద్వారా మహిళల రాజకీయ ప్రాతినిధ్యాన్ని కేంద్రం సుస్థిరం చేసిందని ఆయన కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుపరిపాలనలో "మహిళా నేతృత్వంలోని అభివృద్ధి" అనేది కేవలం ఒక నినాదం కాదని, అది క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న వాస్తవమని ఆయన స్పష్టం చేశారు. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణంలో మహిళలు కీలక భాగస్వాములవుతున్నారని, వారి ఆర్థిక మరియు సామాజిక ఎదుగుదలే దేశాభివృద్ధికి కొలమానమని తెలిపారు. రిజర్వేషన్ల ద్వారా లభించే అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకుని, పరిపాలనలో తమదైన ముద్ర వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో పాల్గొన్న మహిళలు దేశ ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలియజేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. చట్టసభల్లో రిజర్వేషన్లు మహిళల ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని, స్థానిక సంస్థల నుండి పార్లమెంట్ వరకు మహిళల గళం బలంగా వినిపిస్తుందని పాల్గొన్న ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా విద్యావంతులైన యువతులు రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని, ఈ చట్టం వారికి ఒక గొప్ప వేదికగా నిలుస్తుందని ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు. నారాయణగూడ నుండి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ నగరంలోని ప్రధాన వీధుల గుండా సాగి అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ మహిళా మోర్చా నాయకులు, కేఎంఐటీ కళాశాల ప్రతినిధులు మరియు పెద్ద ఎత్తున మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు. రిజర్వేషన్ల అమలుతో భవిష్యత్తులో శాసనసభలు మరియు పార్లమెంట్‌లో మహిళల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, తద్వారా స్త్రీ సంక్షేమ పథకాల రూపకల్పనలో మరింత పారదర్శకత వస్తుందని నేతలు ఈ సందర్భంగా విశ్లేషించారు.

# గ్రామీణాభివృద్ధికి కొత్త దిశానిర్దేశం

**జనం వాయిస్, హైదరాబాద్, ఏప్రిల్ 15:**
తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న రాజేంద్రనగర్‌లోని టీజీ ఐఆర్డీ కార్యాలయంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క బుధవారం సమగ్ర సమీక్ష నిర్వహించారు. సంస్థ నిర్వహిస్తున్న వివిధ శిక్షణ కార్యక్రమాలు, భవిష్యత్తు కార్యాచరణపై ఆమె ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర వికాసం కోసం వినూత్నమైన ప్రణాళికలు రూపొందించాలని, అప్పుడే పల్లెల్లో నిజమైన మార్పు సాధ్యమవుతుందని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో టీజీ ఐఆర్డీ సీఈఓ కె. నిఖిల సంస్థ యొక్క ప్రస్తుత కార్యకలాపాలను మంత్రికి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా సర్పంచ్‌లకు విజయవంతంగా శిక్షణ పూర్తి చేశామని, ప్రస్తుతం వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. మాస్టర్ ట్రైనర్ల ద్వారా జిల్లాల్లో జరుగుతున్న ఈ శిక్షణల ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయని పేర్కొన్నారు. సంస్థలో ఉన్న నిపుణుల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని, శిక్షణ మెటీరియల్‌ను మరింత సరళంగా, సామాన్యులకు అర్థమయ్యే రీతిలో రూపొందించాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ప్రజలకు, ప్రజాప్రతినిధులకు స్థానిక సంస్థల నిధులు, విధులు మరియు హక్కులపై పూర్తిస్థాయి అవగాహన ఉండాలని మంత్రి నొక్కి చెప్పారు. ప్రజలు తమ బాధ్యతలను, హక్కులను గుర్తించినప్పుడే గ్రామాల్లో అభివృద్ధి పారదర్శకంగా జరుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో అమలవుతున్న చట్టాలపై అక్కడి స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించాలని సూచించారు. దీనివల్ల గిరిజన ప్రాంతాల్లో పాలన మరింత మెరుగుపడుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. టీజీ ఐఆర్డీలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి భరోసా ఇచ్చారు. సంస్థలో కొత్త ఆడిటోరియం నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూపొందించిన యాక్షన్ ప్లాన్ అమలులో ఎటువంటి జాప్యం జరగకుండా ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. దేశంలోనే అత్యున్నత శిక్షణా సంస్థగా పేరుగాంచిన టీజీ ఐఆర్డీ ప్రతిష్ఠను కాపాడేలా సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని కోరారు. గ్రామీణ పాలనలో నాణ్యతను పెంచేలా శిక్షణా విధానాలు ఉండాలని, శిక్షణ పొందిన వారు క్షేత్రస్థాయిలో మార్పు తీసుకువచ్చేలా ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. నిధుల వినియోగంలో పారదర్శకత, ప్రాధాన్యత క్రమంలో పనుల ఎంపికపై ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇవ్వడం ద్వారా పల్లెలు స్వయం సమృద్ధి సాధిస్తాయని వివరించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, సంస్థ ప్రొఫెసర్లు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మంత్రి సమీక్షతో టీజీ ఐఆర్డీ కార్యకలాపాల్లో కొత్త వేగం పుంజుకోనుంది.



# పెద్దపల్లిలో భారీ జాబ్ మేళా ఏర్పాటు

- ఏప్రిల్ 17న టాస్క్ సెంటర్‌లో నిర్వహణ.
- ప్రముఖ కంపెనీలతో ఇంటర్వ్యూలు.
- నిరుద్యోగ యువతకు మంచి అవకాశం.

**జనం వాయిస్, పెద్దపల్లి, ఏప్రిల్ 15:**
జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 17న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో భారీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. టాస్క్ రీజినల్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడనుంది. పెద్దపల్లి బస్టాండ్ సమీపంలోని టాస్క్ రీజినల్ సెంటర్‌లో ఉదయం 10 గంటల నుంచి ఈ జాబ్ డ్రైవ్ ప్రారంభం కానుంది. డిప్లొమా, ఐటీఐ, ఎంబీఏ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని అధికారులు తెలిపారు. ఈ మేళాలో ఏజే సొల్యూషన్స్, వార్కస్ ఈవీ మోటార్స్, మెగా ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ వంటి ప్రముఖ సంస్థలు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాయి. అర్హత ఆధారంగా ఉద్యోగాల కోసం అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు ఆసక్తి గల అభ్యర్థులు రెండు సెట్ల తాజా రెజ్యూమ్‌లతో పాటు ఫార్మల్ డ్రెస్‌లో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కలెక్టర్ సూచించారు. నిర్ణీత సమయానికి ముందుగానే వేదికకు చేరుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలోని అర్హత కలిగిన యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి కంపెనీల్లో ఉద్యోగాలు పొందాలని అధికారులు కోరారు. మరిన్ని వివరాల కోసం టాస్క్ రీజినల్ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ జాబ్ మేళా ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు జిల్లాలో నిరుద్యోగ సమస్య కొంత మేర తగ్గుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.



# సైబరాబాద్‌లో సివిక్ పనులపై సమీక్ష

- సెరిలింగంపల్లి, కూకట్‌పల్లి జోన్లలో సమావేశాలు.
- 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై దృష్టి.
- పనుల వేగం, సమన్వయంపై కమిషనర్ ఆదేశాలు.






**జనం వాయిస్, హైదరాబాద్, ఏప్రిల్ 15:**
సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సెరిలింగంపల్లి, కూకట్‌పల్లి జోన్లలో సివిక్ పనులపై సమీక్ష సమావేశాలు నిర్వహించారు. జోనల్ కమిషనర్లు, విభాగాధిపతులు, సర్కిల్ అధికారులు పాల్గొని ప్రగతి స్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రతి అంశంపై పనుల పురోగతిని పరిశీలించిన కమిషనర్, కొనసాగుతున్న పనులను నిర్ణీత గడువుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ఇంజనీరింగ్ పనులు, డీసిల్టింగ్, జంక్షన్ అభివృద్ధి, గుంతల మరమ్మతులు, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాలను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. అలాగే అక్రమ నిర్మాణాల తొలగింపు, ఖాళీ స్థలాల బౌండరీ నిర్ధారణ పనులను క్రమబద్ధంగా చేపట్టాలని సూచించారు. పరిశుభ్రత చర్యలు, దోమల నియంత్రణ, వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ తెలిపారు. టౌన్ ప్లానింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, ప్రజల ఫిర్యాదులకు వెంటనే స్పందించాలని ఆదేశించారు. రెవెన్యూ సేకరణను మెరుగుపరచాలని, సాట్ ఆటో రూట్లను ఖరారు చేసి అమలు చేయాలని సూచించారు. సేవల నాణ్యత పెంచేందుకు విభాగాల మధ్య సమన్వయం కీలకమని తెలిపారు. పట్టణాభివృద్ధిలో వేగం, పారదర్శకత ఉండాలని కమిషనర్ స్పష్టం చేశారు. నిరంతర పర్యవేక్షణ, బాధ్యతతో పనిచేస్తేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమని పేర్కొన్నారు.

# ఇంటర్‌లో మెరిసిన కేజీబీవీ విద్యార్థినులకు కలెక్టర్ అభినందనలు

- కలెక్టరేట్‌లో సత్కారం, ప్రోత్సాహం.
- ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచన.
- విద్యతోనే భవిష్యత్తు బంగారం: కలెక్టర్ సందేశం.




**జనం వాయిస్, వనపర్తి, ఏప్రిల్ 15:**
జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో చదివి ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అభినందించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో విద్యార్థినులను ప్రత్యేకంగా ఆహ్వానించి సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థినులకు చాక్లెట్లు అందజేసి వారి ప్రతిభను ప్రశంసించారు. కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించినందుకు వారికి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థినుల విజయంపై ఆనందం వ్యక్తం చేశారు. ఇంటర్మీడియట్ పరీక్షల్లో సాధించిన విజయాన్ని మొదటి మెట్టుగా భావించాలని, భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. చదువులో క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని చెప్పారు. విద్యార్థినులు సమాజానికి ఆదర్శంగా నిలవాలని, తమ ప్రతిభతో కుటుంబం, జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యతోనే జీవితంలో స్థిరత్వం, గౌరవం పొందవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం బాలికల విద్యకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకం ఉంచి ప్రోత్సహించినందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ, మరింత కృషి చేసి ఉన్నత స్థాయికి చేరుతామని చెప్పారు.

# విద్యుత్ ఉద్యోగుల పోరాటానికి బీఆర్ఎస్ మద్దతు

- కాంగ్రెస్‌కు కరెంట్ షాక్ తప్పదన్న దాస్యం వినయ్ భాస్కర్.
- ఆర్టిజన్స్, అన్‌మ్యాన్డ్ వర్కర్ల డిమాండ్లకు అండ.
- హక్కుల సాధనకు ధరణా వేదికల వద్ద సంఘీభావం.





**జనం వాయిస్, హనుమకొండ, ఏప్రిల్ 15:**
విద్యుత్ ఉద్యోగుల హక్కుల సాధన కోసం కొనసాగుతున్న ఉద్యమానికి బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఈ మేరకు స్పష్టం చేశారు. తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండలోని నక్కలగుట్ట టీజీఎన్పీడీసీఎల్ కార్యాలయం, ములుగు రోడ్డులోని ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద జరుగుతున్న ధరణాలకు ఆయన హాజరై సంఘీభావం తెలిపారు. ఉద్యోగుల సమస్యలను స్వయంగా విని వారికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ ఆర్టిజన్స్, అన్‌మ్యాన్డ్ వర్కర్ల డిమాండ్ల సాధనకు బీఆర్ఎస్ పూర్తిగా మద్దతుగా ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో 26 వేల విద్యుత్ ఉద్యోగులు, వారి కుటుంబాలకు గులాబీ శ్రేణులు అండగా ఉంటాయని హామీ ఇచ్చారు. విద్యుత్ శాఖలో రిటైర్మెంట్లు జరుగుతున్నప్పటికీ కొత్త నియామకాలు చేపట్టడం లేదని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రజలకు వెలుగులు అందిస్తున్న ఉద్యోగుల జీవితాల్లో చీకట్లు అలుముకుంటున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, విద్యుత్ ఉద్యోగులే ఈ ప్రభుత్వానికి 'కరెంట్ షాక్' ఇవ్వబోతున్నారని వ్యాఖ్యానించారు. ఉద్యోగుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ప్రజల మద్దతు కోల్పోతారని హెచ్చరించారు. తాను ఒక విద్యుత్ ఉద్యోగి కుటుంబానికి చెందినవాడినని, ఆర్టిజన్స్ కష్టాలు తెలుసునని తెలిపారు. ఉద్యోగుల హక్కుల సాధన వరకు ఎల్లప్పుడూ తమతో ఉంటానని భరోసా ఇచ్చారు. ఉద్యమాన్ని మరింత బలంగా కొనసాగించాలని పిలుపునిచ్చారు.

# కర్నె ప్రభాకర్ కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్

- యువనేత అరవింద్ చిత్రపటానికి నివాళులు.
- కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్.
- పరామర్శించిన వారిలో పలువురు పార్టీ ముఖ్య నేతలు.



**జనం వాయిస్, హైదరాబాద్, ఏప్రిల్ 15:**
బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ సోదరుడి కుమారుడు, యువ నేత కర్నె అరవింద్ ఇటీవల అకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) బుధవారం వారి నివాసానికి వెళ్లారు. మరణించిన అరవింద్ చిత్రపటానికి కేటీఆర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. యువ నాయకుడిని కోల్పోవడం పార్టీకి, కుటుంబానికి తీరని లోటని ఆయన ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కర్నె ప్రభాకర్ మరియు వారి కుటుంబ సభ్యులతో కేటీఆర్ మాట్లాడారు. పుత్ర సమానుడైన సోదరుడి కుమారుడి మరణం కలిగించిన బాధను ఎవరూ భర్తీ చేయలేరని, అయితే ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని ఆయన వారిని ఓదార్చారు. అరవింద్ పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా ఉండేవారని, అతని మరణ వార్త దిగ్భ్రాంతికి గురిచేసిందని కేటీఆర్ పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కేటీఆర్‌తో పాటు పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు కూడా పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్ఎస్ నాయకులు క్యామ మల్లేష్ తదితరులు అరవింద్ నివాసానికి చేరుకుని నివాళులర్పించారు. కర్నె ప్రభాకర్ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అరవింద్ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని వారు కోరుకున్నారు. పార్టీలో సీనియర్ నాయకుడిగా ఉన్న కర్నె ప్రభాకర్ కుటుంబంలో జరిగిన ఈ విషాదం పట్ల బీఆర్ఎస్ శ్రేణులు విచారం వ్యక్తం చేస్తున్నాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాతో పాటు హైదరాబాద్‌లోని పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పరామర్శకు తరలివచ్చారు. అరవింద్ మరణం పట్ల ఇప్పటికే పలువురు రాజకీయ ప్రముఖులు తమ సంతాపాన్ని ప్రకటించారు. సోషల్ మీడియా వేదికగా కూడా అరవింద్ చిత్రపటాన్ని షేర్ చేస్తూ అభిమానులు, కార్యకర్తలు నివాళులర్పిస్తున్నారు. యువత రాజకీయాల్లోకి వచ్చి సమాజ సేవ చేయాలని ఆకాంక్షించే అరవింద్ వంటి యువ నేతను కోల్పోవడం దురదృష్టకరమని నేతలు అభిప్రాయపడ్డారు. పార్టీ పట్ల ఆయనకు ఉన్న అంకితభావాన్ని వారు స్మరించుకున్నారు. కేటీఆర్ పర్యటనతో కర్నె ప్రభాకర్ కుటుంబ సభ్యులకు కొంత ఉపశమనం లభించింది. పార్టీ అగ్ర నాయకత్వం తమ వెంటే ఉందనే ధైర్యాన్ని వారు పొందుతున్నారు. ఈ పరామర్శ కార్యక్రమం అనంతరం కేటీఆర్ అక్కడి నుండి బయలుదేరి వెళ్లారు.



# గోదావరిఖనిలో మంత్రి వివేక్ పర్యటన

- సింగరేణి ఆసుపత్రిలో రోగిని పరామర్శ.
- మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఆదేశం.
- నిశ్చితార్థ వేడుకలో పాల్గొని ఆశీర్వాదాలు.



**జనం వాయిస్, పెద్దపల్లి, ఏప్రిల్ 15:**
గోదావరిఖనిలో రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి పర్యటించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలను కలుసుకున్నారు. సింగరేణి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జయశ్రీని మంత్రి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు అందించాలంటూ వైద్యులకు సూచించారు. రోగులకు మెరుగైన వైద్యం అందించడం ప్రభుత్వ బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. ఆసుపత్రిలో సదుపాయాలను మరింత మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. రోగుల పట్ల సిబ్బంది సహానుభూతితో వ్యవహరించాలని సూచించారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు రాచకొండ కోటేశ్వర్ కుమార్తె అక్షయ నిశ్చితార్థ వేడుకకు మంత్రి హాజరయ్యారు. కుటుంబ సభ్యులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్షయ-శశిధర్ జంటకు మంత్రి ఆశీర్వాదాలు అందజేశారు. వారి భవిష్యత్ జీవితం సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మంత్రి పర్యటనతో స్థానికుల్లో ఉత్సాహం నెలకొంది. ప్రజా సమస్యలపై కూడా ఆయన దృష్టి సారించినట్లు నాయకులు తెలిపారు.

# ఖమ్మంలో విద్యుత్ సరఫరా మెరుగుదల చర్యలు

- సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు.
- లోడ్ తగ్గింపు, వోల్టేజ్ మెరుగుదల లక్ష్యం.
- విద్యుత్ సరఫరా నిరంతరతకు చర్యలు.



**జనం వాయిస్, ఖమ్మం, ఏప్రిల్ 15:**
వేసవి కాలంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని టీజీఎన్పీడీసీఎల్ సమ్మర్ యాక్షన్ ప్లాన్ కింద కీలక చర్యలు చేపట్టింది. ఖమ్మం డివిజన్‌లో అదనంగా 100 కెవీఏ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌ను విజయవంతంగా అమర్చింది. పాండురంగాపురం డిస్ట్రిబ్యూషన్ పరిధిలోని సప్తవర్ణ అపార్ట్‌మెంట్ రోడ్, బల్లేపల్లి సెక్షన్‌లో ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి చార్జ్ చేశారు. స్థానిక వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు వల్ల ప్రస్తుత ట్రాన్స్‌ఫార్మర్లపై ఉన్న లోడ్ తగ్గుతుందని, వోల్టేజ్ స్థాయి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గే అవకాశముందని తెలిపారు. వేసవి కాలంలో విద్యుత్ వినియోగం అధికంగా ఉండటంతో ముందస్తుగా మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. టీజీఎన్పీడీసీఎల్ ఆధ్వర్యంలో విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేసే పనులు కొనసాగుతున్నాయి. అవసరమైన చోట్ల అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల మెరుగుదల పనులు చేపడుతున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించడం తమ ప్రధాన లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు. వేసవిలో కూడా విద్యుత్ సేవలను సమర్థవంతంగా అందించేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు.

RNI NO:TGTEL/26/A0383
దినపత్రిక జనం వాయిస్
తెలుగు దినపత్రిక
WWW.JANAMVOICE.COM

# కల్వకోల్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటికి ముగ్గు పోసిన

## కల్వకోల్ గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ

**మహేశ్వరం, ఏప్రిల్ 15,(జనం వాయిస్):**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కల్వకోల్ గ్రామంలో అర్హత గల చిన్న అంజయ్యకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం జరిగింది.దీనికి గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఉప సర్పంచ్ జనార్దన్ గౌడ్, వార్డ్ సభ్యులు అందరూ కలిసి ఇందిరమ్మ ఇంటికి ముగ్గు పోయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, సాయిని గోపాల్ రెడ్డి, అరటి కుమార్, తిరుమల యాదయ్య, జంపుల భారతమ్మ, మరియు గ్రామ పెద్దలు, పులిమామిడి లక్ష్మీనారాయణ గౌడ్,బక్కని రవి మాదిగ, అరటి వెంకటేష్, గుర్రంపల్లి నరసింహ, రామచంద్రి, లబ్ధిదారుడు అరడి చిన్న అంజయ్య, లక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.



# మహేశ్వరం గ్రామ 3వ వార్డు లో సిసి రోడ్డు పనులు ప్రారంభించిన

## రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్

**మహేశ్వరం, ఏప్రిల్ 15, (జనం వాయిస్):**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కేంద్రం 3వ వార్డు లో కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి గారి సహకారంతో హెచ్ఎండిఏ నిధుల 5 లక్షల రూపాయలతో పనులు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్. శివగంగా ఆలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్. అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అల్లే బిక్షపతి. మహేశ్వరం గ్రామ మాజీ ఉపసర్పంచ్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు కర్రెల రాములు ముదిరాజ్.కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షులు బంగారుగళ్ల లాజర్. మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా. మహేశ్వరం గ్రామపంచాయతీ సభ్యులు. ఆవులకాడి కిష్టమ్మ. షేక్ ఆజం. ఆకుల వీరుబాబు. కడ మోని ప్రభాకర్ . సున్నం కృష్ణ.శివగంగ ఆలయ కమిటీ డైరెక్టర్ పోతర్ల తిరుపతయ్య యాదవ్. కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు స్వర్ణ గంటి ఆకాష్. కాంగ్రెస్ పార్టీ నాయకులు పుట్లగారి చందు. కాకి మల్లేష్ ముదిరాజ్. కటికల జగన్ ముదిరాజ్. సేమియా నాయక్. 3వ వార్డు వాస్తవ్యులు సయ్యద్ నుస్రత్ అలీ. మాడుగుల నరసింహ. శివ. వద్ది శ్రీశైలం. నిమ్మగూడెం దయానంద్ గౌడ్. నిమ్మగూడెం రోహిత్ గౌడ్. సయ్యద్ ఉల్ పాత్ అలీ. తదితరులు పాల్గొన్నారు.



# కాకి ఈశ్వర్ ముదిరాజ్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన

## తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గదగుటి మహేందర్ ముదిరాజ్

**మహేశ్వరం, ఏప్రిల్ 15, (జనం వాయిస్):**

తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గదగుటి మహేందర్ ముదిరాజ్ తెలిపారు.కాకి ఈశ్వర్ ముదిరాజ్ మరెన్నో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని రాజకీయం ఉన్నత పదవులు పొందాలని కోరారు.



# ఏసీబీ వలలో అవినీతి తిమింగలం

## లంచం తీసుకుంటూ చిక్కిన మునిసిపాలిటీ ఏఈ

**జనం వాయిస్, హుజురాబాద్:**

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మున్సిపాలిటీలో అవినీతి ఘటన వెలుగులోకి వచ్చింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ నుసుం సుధాకర్ రెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. బుధవారం హుజూరాబాద్ ఆర్టీసీ డిపో చౌరస్తా వద్ద కాంట్రాక్టర్ నుంచి రూ.50,000 లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా కరీంనగర్ ఏసీబీ అధికారులు అతడిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన వర్షపు నీటి కాలువ పనులకు సంబంధించిన మెజర్‌మెంట్ బుక్ (ఎంబీ) నమోదు చేసి తుది బిల్లును ప్రాసెస్ చేయడానికి లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధిత కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, వారు పక్కా ప్రణాళికతో నిందితుడి వద్ద నుంచి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఈ మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి కరీంనగర్‌లోని ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది. ఫిర్యాదుదారుడి వివరాలను భద్రతా కారణాల దృష్ట్యా గోప్యంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు. అలాగే లంచం డిమాండ్ చేసే ప్రభుత్వ ఉద్యోగులపై ప్రజలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని ఏసీబీ సూచించింది.



# కాకి ఈశ్వర్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన

## మహేశ్వరం నియోజకవర్గం ఇన్చార్జి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి పార్టీ నాయకులు






**మహేశ్వరం, ఏప్రిల్ 15, (జనం వాయిస్):**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్ 56వ పుట్టినరోజు సందర్భంగా అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్చార్జి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి కాకి ఈశ్వర్ గారిని శుభాకాంక్షలు తెలిపి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్.కి శుభాకాంక్షలు తెలిపిన మహేశ్వరం అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య. శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్. ఉప్పుగడ్డ గ్రామ సర్పంచ్ రాజు నాయక్. కోళ్ల పడకల్ గ్రామ సర్పంచ్ చేపంగి ప్రవీణ్ .కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షులు బంగారిగల్ల లాజర్. మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా.మహేశ్వరం మండల సమన్వయ కమిటీ చైర్మన్ మల్లేష్ యాదవ్. ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి. కబడ్డీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మద్ది కర్ణాకర్ రెడ్డి. కార్మిక శాఖ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షులు నడి కూడా శివ. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గదగుటి జంగయ్య ముదిరాజ్. ఆవుల యాదయ్య. ప్రశాంత్ రెడ్డి. రాఘవేందర్ రెడ్డి. ఇంద్రకంటి నరసింహ గౌడ్ .మాజీ ఎంపిటిసిలు పాండు నాయక్. హరికిషన్ గౌడ్. మహేశ్వరం గ్రామ మాజీ ఉపసర్పంచ్ దోమ శ్రీనివాస్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిపార్ట్మెంట్ మహేశ్వరం మండల్ చైర్మన్ మహమ్మద్ ఇర్షాద్. మహేశ్వరం మండల్ యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నడికుడ రాకేష్ ముదిరాజ్. సేవాదళ్ నియోజకవర్గం అధ్యక్షులు గదగూటి హరికృష్ణ ముదిరాజ్. సేవాదళ్ మండల అధ్యక్షులు శెట్టి అశోక్. శివగంగ ఆలయ కమిటీ డైరెక్టర్లు పోతర్ల తిరుపతయ్య యాదవ్. పేయ్యాల దేవేందర్. ఒగ్గు శంకర్. కనీగట్ల శ్రీశైలం ముదిరాజ్. మహేశ్వరం గ్రామ పంచాయతీ సభ్యులు శాలిని సన్నికుమార్ . మునావత్ రవి నాయక్.కాంగ్రెస్ పార్టీ నాయకులు మోత యాదయ్య. గగనం ఆంజనేయులు.పుట్లగారి చందు. ఏపీ నరసింహ. కాకి మల్లేష్ ముదిరాజ్. పేనమోనీ శ్రీకాంత్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

# తెలంగాణ జాగృతిలో చేరిన జమ్మికుంట వైఎస్ఆర్టీపీ నాయకులు

**జనంవాయిస్, హుజురాబాద్:**

జమ్మికుంట పట్టణానికి చెందిన వైఎస్ఆర్టీపీ మండల అధ్యక్షుడు అంబాల హరీష్‌తో పాటు యూత్ నాయకులు రితీష్, నరేష్, సురేష్, విజయ్, శ్రీనివాస్, రమేష్ తదితరులు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కవిత వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అంబాల హరీష్ మాట్లాడుతూ, రానున్న రోజుల్లో కవిత నాయకత్వంలో పని చేస్తూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలని లక్ష్యంగా పెట్టుకుని తెలంగాణ జాగృతిలో చేరినట్లు తెలిపారు. యువతకు ప్రాధాన్యత ఇస్తూ సమాజ సేవ చేయడానికి ఈ వేదిక అనుకూలమని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని, స్థానిక స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# జమ్మికుంట పట్టణంలోని మెగా డయాగ్నసిస్ సెంటర్ ని తనిఖీ చేసిన డిప్యూటీ డి ఎం హెచ్ ఓ

**జనం వాయిస్,జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణంలోని మెగా డయాగ్నసిస్ సెంటర్ మరియు లోటస్ డయాగ్నసిస్ సెంటర్ ను డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ శ్రవణ్ తనిఖీ చేయడం జరిగింది.తనిఖీ లో భాగంగా సెంటర్ నిర్వాహకులకు పి సి పి ఎన్ డి టి ఆక్టును (గర్భధారణకు ముందు మరియు ప్రసవపూర్వ నిర్ధారణ పద్ధతులు లింగ ఎంపిక నిషేధం చట్టం, 1994.) పకడ్బందీగా అమలు చేయాలని రికార్డులను ఫారం ఎఫ్ లో పొందుపరచాలని, ఒకవేళ రికార్డులు ఫారం ఎఫ్ లో పొందుపరచకపోతే చట్ట ప్రకారం చర్యలుతీసుకోవడంజరుగుతుంది. ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే వారి మీద పిసి పి ఎన్ డి టి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంజరుగుతుందని,డయాగ్నిసిస్ సెంటర్ కు వచ్చే పేషెంట్స్ కు సరైన సౌకర్యాలు కల్పించాలని వారిని ఎటువంటి ఇబ్బందులకు గురి చేయరాదని ప్రభుత్వనిబంధనలనుఅతిక్రమించకూడదని ప్రభుత్వ నిబంధనలకు లోబడి నిర్వహించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సదానందం, సూపర్వైజర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదాల నివారణ మన అందరి బాధ్యత

- హెల్మెట్ దరిద్దాం సురక్షిత ప్రయాణం చేద్దాం.
- హుజురాబాద్ ఏసీపీ మాధవి.

**జనం వాయిస్, జమ్మికుంట:**

రోడ్డు ప్రమాదాలను నివారించడం మన అందరి బాధ్యత అని ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని హుజరాబాద్ ఏసిపి వాసంశెట్టి మాధవి తెలిపారు. రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా కరీంనగర్ సిపి ఆదేశాల మేరకు జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి స్థానిక సువర్ణ ఫంక్షన్ హాల్ సర్కిల్లో మానవహారం నిర్వహించి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు తమ ద్విచక్ర వాహనంపై వెళ్తున్నప్పుడు హెల్మెట్ ఉపయోగించుకోవాలని మొబైల్ ఫోన్ మాట్లాడుతూ ప్రయాణం చేయకూడదని సూచించారు. అంతేకాకుండా కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని అప్పుడే ప్రమాదాలు జరిగినప్పుడు సురక్షితంగా బయట పడతామని తెలిపారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించాలని మీ కుటుంబ సభ్యులు ఇంట్లో నుండి బయటకు వెళ్ళేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని వారికి సూచించాలని విద్యార్థులకు తెలిపారు. రోడ్డు ప్రమాదాలపై జమ్మికుంట ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఏసీపీ మాధవి పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి అందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ప్రతి విద్యార్థి రోడ్డు ప్రమాదాలు జరగకుండా తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఈ విషయంలో పిల్లలందరూ కూడా తమ తల్లిదండ్రులకు పలు సూచనలు చేస్తూ సురక్షితమైన ప్రయాణం గురించి వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ వెంకటేశ్వర్లు ఐలయ్య ఫిజికల్ డైరెక్టర్ శ్రీలత తో పాటు పలువురు ఉపాధ్యాయులు ఫ్రెండ్స్ టీం సభ్యులు పాల్గొన్నారు.





# బాల్యమిత్రుని కుటుంబానికి అండగా చిన్ననాటి మిత్రులు

## - మృతిని కుటుంబానికి 65 వేల ఆర్థిక సాయం

**జనం వాయిస్ ఇల్లందకుంట :**

హుజురాబాద్ ఏరియా ఆస్పత్రిలో సెక్యూరిటీగా పనిచేస్తున్న ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామానికి చెందిన ముప్పు నరేష్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయన బాల్యమిత్రులు నరేష్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం 1నిమిషం మౌనం పాటించారు. 2003-04 వరకు పదవ తరగతి సిరిసేడు ప్రభుత్వ పాఠశాలలో కలిసి చదివిన స్నేహితులు నరేష్‌తో పంచుకున్న జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. “మాతో కలిసి ఆడి పాడి చదువుకున్న మంచి మనసున్న వ్యక్తిని కోల్పోవడం ఎంతో బాధాకరం” అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం బాల్యమిత్రులతో పాటు ఇంటర్, డిగ్రీ చదివిన తోటి మిత్రులు కలిసి రూపాయలు 65 వేల నగదును నరేష్ సతీమణికి అందజేశారు. నరేష్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఇకపై కూడా నరేష్ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని, ఎలాంటి సమస్యలు ఎదురైనా తోడుగా నిలుస్తామని మిత్రులు తల్లికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిరిసేడు గ్రామానికి చెందిన బాల్యమిత్రులు, ఇంటర్-డిగ్రీ మిత్రబృందం పాల్గొన్నారు.



# జమ్మికుంట బీజేపీ పట్టణ నూతన కార్యవర్గం ఏర్పాటు

**జనం వాయిస్, జమ్మికుంట:**





జిల్లా సంఘటన పర్వ్ కార్యక్రమంలో భాగంగా జమ్మికుంట పట్టణ బీజేపీ కార్యవర్గాన్ని పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు ప్రకటించారు. కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆమోదం తెలిపిన అనంతరం ఈ జాబితాను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ బీజేపీ ఉపాధ్యక్షులుగా గర్రెపల్లి నిరూప రాణి, ఆడువాల శ్రీధర్, కొమ్ము అశోక్, కేస స్వరూపలను నియమించారు. ప్రధాన కార్యదర్శులుగా కైలాసకొటి గణేష్, రాచపల్లి ప్రశాంత్‌ను ఎంపిక చేశారు. కార్యదర్శులుగా రాకేష్ ఠాకూర్, ఆకుల తిరుపతి, వాల్లాల సతీష్ బాబు, రాయబారపు సురేష్‌లను నియమించారు. కోశాధికారిగా కొండ్లె నగేష్‌ను నియమించగా, మరో 34 మందిని పట్టణ కార్యవర్గ సభ్యులుగా నియమించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని నాయకులు సూచించారు. తమపై నమ్మకంతో పట్టణ కమిటీలో అవకాశం కల్పించిన కేంద్ర మంత్రి బండి సంజయ్, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు వారికి నూతనంగా నియమితులైన సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆర్థిక సహాయం అందచేసిన కటుకు వినయ్ మిత్ర బృందం

**జనం వాయిస్, గోదావరిఖని, ఏప్రిల్ 15:**

గోదావరిఖని విఠల్ నగర్ కి చెందిన కుంచం శ్రీకాంత్ ఇటీవల బైక్ పైన వెళ్తుంటే గౌతమి నగర్ సమీపం లో రాంగ్ రూట్ లో వస్తున్న జెసిబి శ్రీకాంత్ బైక్ నీ బలంగా డీ కొట్టింది దీంతో కుంచం శ్రీకాంత్ కుడి కాలుకు లోతు అయిన గాయం కావడం తో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరించారు శ్రీకాంత్ ఆపరేషన్ కి 3 లక్షలు వరకు ఖర్చు అవుతుంది వైద్యులు తెలిపారు దీంతో విఠల్ నగర్ కి చెందిన కటుకు వినయ్ ఆధ్వర్యంలో వారి మిత్ర బృందం తో కలిసి శ్రీకాంత్ కు వైద్య ఖర్చుల కోసం రూ 29122 /- కొంత నగదును శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు అందచేశారు ఈ సందర్భంగా ఆపద సమయం లో సహాయం చేసిన కటుకు వినయ్ మిత్ర బృందానికి శ్రీకాంత్ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.



# డ్రంకన్ డ్రైవ్ లో ఒక వ్యక్తి కి రెండు రోజులు జైలు శిక్ష

**జనం వాయిస్, గోదావరిఖని, ఏప్రిల్ 15:**

గోదావరిఖని పట్టణం రామగుండం ట్రాఫిక్ సి ఐ బీ. రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు ఈ తనిఖీలు లో పట్టుబడిన 3 ముగ్గురి వ్యక్తుల ను బుధవారం కోర్టు లో హాజరుపరిచారు వారి లో ఇద్దరికీ 4000 /- జరిమానా విధించారు రెండవ సారి పట్టుబడ్డ వ్యక్తి కి రెండు రోజులు జైలు శిక్ష పడినట్లు ట్రాఫిక్ సి ఐ తెలిపారు టు వీలర్ వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి అని ట్రాఫిక్ సి ఐ హెచ్చరించారు.



# గడువు లోగా పనులు పూర్తి చేయాలి.

## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.

**జనం వాయిస్, పెద్దపల్లి, ఏప్రిల్ 15:**

జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఇంజనీరింగ్ అధికారులతో అభివృద్ధి పనుల పురోగతి పై జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జిల్లాలోని విద్యా సంస్థల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, నూతన తరగతి గదుల నిర్మాణం, మౌలిక వసతుల ఏర్పాటును వేగవంతం చేసి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయాల పనులను జూన్ నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని,ప్రారంభోత్సవాలకు సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు. పనుల వేగవంతం కోసం అవసరమైతే అదనపు షిఫ్ట్‌లు ఏర్పాటు చేయాలని, రాత్రివేళల్లో కూడా లైటింగ్ సదుపాయాలతో పనులు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, జిల్లాలో చేపట్టిన అంగన్వాడీ కేంద్రాల మరమ్మత్తు పనులను మే 15లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఈఈ పీఆర్ శంకరయ్య,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# మతం మారిన వారి సర్టిఫికెట్ రద్దు కోసం న్యాయ పోరాటం

## విశ్వహిందూ పరిషత్ నేత పగడాకుల బాలస్వామి

**జనం వాయిస్, హైదరాబాద్, ఏప్రిల్ 15:**

అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని అంబేద్కర్ గారు రచించిన రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని విశ్వహిందూ పరిషత్ నేత పగుడాకుల బాలస్వామి అన్నారు. హిందూ ధర్మం లో వివక్షను ఎదుర్కొంటున్న వారికి మాత్రమే రిజర్వేషన్లు అమలు కావాలని, హిందూ ధర్మాన్ని వీడి క్రైస్తవ మతం ఆచరిస్తున్న వ్యక్తులకు రిజర్వేషన్ పొందే అర్హత లేదని ఆయన అన్నారు. ఇదే విషయాన్ని డాక్టర్ అంబేద్కర్ స్పష్టం చేసినట్లు తెలియజేశారు. ప్రస్తుతం చాలామంది దళితులు సర్టిఫికెట్ లో హిందూ మతాన్ని చూపిస్తూ.. నిత్యజీవితంలో క్రైస్తవ మతాన్ని ఆచరిస్తున్నారని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బాలస్వామి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సామాజికంగా అసమానతలు ఎదుర్కొంటున్న వారికి మాత్రమే రిజర్వేషన్ ఫలాలు అందాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ.. సర్టిఫికెట్ కోసమే హిందూ ధర్మం కావాలి.. విద్య, ఉద్యోగం,వ్యాపారం, రాజకీయం తోపాటు పలు ప్రభుత్వ ఫలాలు పొందడం కోసం ఎస్సీ సర్టిఫికెట్ కావాలి అనుకోవడం అత్యంత కుట్రపూరిత చర్య అని విమర్శించారు. మతం మారిన తర్వాత ఎస్సి సర్టిఫికేట్ ఉపయోగిస్తూ పొందుతున్న ఫలాలు అన్ని కూడా రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఈ చర్య వల్ల నిజమైన దళితులకు (లబ్ధిదారులకు) తీరని అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ అన్ని మండలాల ఎమ్మార్వోలు స్పందించి, ఎస్సీ సర్టిఫికెట్ జారీ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని బాలస్వామి సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న అనేక సబ్సిడీ ఫలాలు కూడా హిందూ మతం వీడిన క్రైస్తవులు పొందుతున్నారని, ఇది పట్టపగలు చేసే దోపిడీ అని దుయ్యబట్టారు. విద్యా, ఉద్యోగం, రాజకీయాలలో కూడా నిజమైన ఎస్సీ లబ్ధిదారుల పొట్ట కొట్టి, వారి నోటికాడి ముద్దను లాక్కొని మతం మారిన క్రైస్తవులు ఎంజాయ్ చేయడం ద్రోహం అన్నారు. ఈ విషయంపై భారీ స్థాయిలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడతామని



చెప్పారు.

మన చుట్టుపక్కల ఇంతటి వారైనా సరే హిందూ సర్టిఫికెట్ పొంది, ప్రభుత్వపరంగా ఫలాలు అనుభవిస్తున్న వ్యక్తులు మతం మారినట్లు తెలిస్తే , వెంబడే ఆయా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఈ విధమైన న్యాయపోరాటంతోనే నిజమైన లబ్ధిదారులకు మేలు కలుగుతుందని పేర్కొన్నారు. కొంతమంది దళిత నాయకులుగా చెప్పుకుంటున్నటువంటి వ్యక్తులు మతం మారి, తిరిగి రాజ్యాంగాన్ని, అంబేద్కర్ గారిని ప్రశ్నించే స్థాయికి ఎదిగారని దుయ్యబట్టారు. అది ముమ్మాటికి ద్రోహం అన్నారు. మతం మారిన వారు క్రైస్తవులుగా చలామణి అవుతున్నటువంటి వారు సుప్రీంకోర్టు తీర్పును ప్రశ్నిస్తూ పోరాటం చేస్తామనడం అంబేద్కర్ గారి పైనే, అంబేద్కర్ ఆశయాలపైనే ఎదురు దాడి చేసినట్లు అని బాలస్వామి తెలిపారు. రిజర్వేషన్లు పొందుతూ మతం మారిన వ్యక్తులు అంబేద్కర్ గారి ఆశయాలను ప్రశ్నించే స్థాయికి ఎదగడం విడ్డూరమన్నారు. వాస్తవాలు తెలుసుకోవాలి కానీ, వాటిని వక్రీకరించే వ్యవహారం చేయడం దుర్మార్గమన్నారు.

హిందూ, బౌద్ధ, సిక్కు మతాలలో మాత్రమే సామాజిక అసమానతలు, వివక్ష ఉన్నదని, కాబట్టి ఆయా మతాల వారికి మాత్రమే రిజర్వేషన్లు వర్తిస్తాయి అని బాలస్వామి చెప్పారు. ఈ విషయంలో గ్రామీణ స్థాయి నుంచి మొదలుకొని విశ్వవిద్యాలయాల వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

ఒకవేళ హిందూ ధర్మం నచ్చకపోయినట్లయితే స్వచ్ఛందంగా హిందుత్వంలోని సర్టిఫికెట్ వీడి, బీసీ సర్టిఫికెట్ పొంది క్రైస్తవ మతం ఆచరించుకోవడంలో ఎవరికి అభ్యంతరం లేదని ఆయన స్పష్టం చేశారు.

బీసీలు, ఓసీలు, ఎస్టీలు కూడా హిందుత్వాన్ని వీడి సర్టిఫికెట్ ఆధారంగా లబ్ధి పొందుతున్నారని, అది కూడా ద్రోహం అన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ డబ్ల్యూ ఎస్ స్కీం కూడా వీడాలన్నారు. తమకు హిందూ జీవన విధానం నచ్చకపోతే వెంటనే ఆ సర్టిఫికెట్లు కూడా రద్దు చేసుకొని, నచ్చిన మతాన్ని స్వీకరించుకోవచ్చు. కానీ హిందూమతం ఆధారంగా సర్టిఫికెట్ పొంది ప్రభుత్వ ఫలాలు అనుభవిస్తామంటే అది రాజ్యాంగాన్ని మోసం చేయడమే అనే విషయం ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు అమలు కోసం ఆయా అధికారులు అప్రమత్తంగా ఉండాలని బాలస్వామి సూచించారు. చదువుకున్న ప్రతి ఒక్కరిని అవగాహన పరిచి, అక్రమ ఫలాలు అనుభవిస్తున్న వారి భరతం పట్టడం కోసం న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. మతం మారిన వారి సర్టిఫికెట్ రద్దు కోసం ఎట్టి పరిస్థితులలో

ఉపేక్షించబోమని తేల్చి చెప్పారు. రిజర్వేషన్లలో రాజకీయ పదవులు అనుభవిస్తున్న నాయకులు వారి ఒరిజినల్ మతం ఏమిటో, ఆచరిస్తున్న జీవన విధానం ఏదో ప్రజలకు స్పష్టం చేయాలని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్రం ధర్మాచార్య సంపర్క ప్రముక్ పగుడాకుల బాలస్వామి నిలదీశారు.

# సింగరేణి అధికారులపై బీజేపీ హెచ్చరిక

**"బీజేపీని తక్కువ అంచనా వేయకండిడ కేంద్రానికి కూడా 49% వాటా ఉంది"**
**బీజేపీ మాజీ పెద్దపల్లి జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్.**

**జనం వాయిస్, పెద్దపల్లి:**

సింగరేణి సంస్థలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి 51 శాతం వాటా, కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉన్న విషయం అందరికీ తెలిసిందే. అయితే 40 వేల పర్మినెంట్ కార్మికుల కుటుంబాలు 25000 కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాలు ఇంకా కంపెనీపై చాలా కుటుంబాలు ఆధారపడి బతుకుతున్నాయి ప్రస్తుతం కొందరు అధికారులు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరిస్తూ సంస్థను అవినీతి కేంద్రంగా మార్చుతున్నారని బీజేపీ మాజీ జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ తీవ్రంగా ఆరోపించారు. సింగరేణిలో టెండర్లు, ఓబి కంపెనీలు ప్రైవేట్ కంపెనీలో ,యంత్రాల కొనుగోలు, స్పేర్ పార్ట్స్, కాంట్రాక్టుల కేటాయింపుల్లో భారీ అవినీతి జరుగుతోందని, కొందరు అధికారులు మరియు కాంట్రాక్టర్లు కుమ్మక్కై సంస్థను నష్టాల్లోకి నెట్టే విధంగా పనిచేస్తున్నారని ఆయన మండిపడ్డారు. "సింగరేణి సంస్థ ప్రజల సొమ్ముతో నడుస్తుంది. ఇది ఒక రాజకీయ పార్టీకి చెందిన ప్రైవేట్ సంస్థ కాదు. అయినప్పటికీ కొందరు అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా పనిచేస్తూ సంస్థను దోపిడీ కేంద్రంగా మార్చుతున్నారు" అని మొలుమూరి శ్రీనివాస్ అన్నారు. "భారతీయ జనతా పార్టీని ఎవరూ తక్కువ అంచనా వేయకండి. కేంద్ర ప్రభుత్వానికి కూడా సింగరేణిలో 49 శాతం వాటా ఉంది. సింగరేణిలో జరుగుతున్న అవినీతిపై మేము మౌనం వహించము" అని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సింగరేణిలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై కేంద్ర ప్రభుత్వానికి అధికారికంగా ఫిర్యాదు చేస్తామని అవసరమైతే విజిలెన్స్, సిబిఐ వంటి దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తామని చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు న్యాయస్థానాలను



ఆశ్రయించడానికీ వెనుకాడమని అవినీతి అధికారులను బహిర్గతం చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన తెలిపారు. "సింగరేణిని కొందరి స్వార్థ రాజకీయాలకు బలి చేయనివ్వము. కార్మికుల భవిష్యత్తు, సంస్థ గౌరవం కోసం బీజేపీ పోరాటం కొనసాగుతుంది" అని హెచ్చరించారు. మొలుమూరి శ్రీనివాస్ బీజేపీ మాజీ జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సెంటినరీ కాలనీ టౌన్ అధ్యక్షుడు తీగల శ్రీధర్ మెరుగు శ్రీకాంత్ దొంతుల సురేష్ కొత్త కమలాకర్ పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

- అరైవ్‌అలైవ్‌లో భాగంగా మూడో రోజు నిర్వహణ.
- హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరి: అధికారులు.
- నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణమన్న హెచ్చరిక.

**జనం వాయిస్, ఖమ్మం, ఏప్రిల్ 15:**

రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు నిర్వహిస్తున్న 'అరైవ్‌అలైవ్' కార్యక్రమంలో భాగంగా ఎస్ఆర్ జూనియర్ కాలేజ్ విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్, పోలీస్ కమిషనర్ సునీల్



దత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం తప్పనిసరి అని అధికారులు పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపకూడదని, సెల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. అతివేగం కూడా రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. చిన్న నిర్లక్ష్యపు చర్యల వల్లనే పెద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. ఒక్క క్షణం నిర్లక్ష్యం వల్ల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితులు వస్తాయని



హెచ్చరించారు. విద్యార్థులు రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో ప్రజల సహకారం అత్యంత అవసరమని పేర్కొన్నారు.

# కేజీబీవీ విద్యార్థినుల అద్భుత ఫలితాలు

- కలెక్టర్ బి. సత్యప్రసాద్ అభినందనలు.
- శ్రుతి, కార్తీక ప్రతిభకు ప్రత్యేక ప్రశంసలు.
- జగిత్యాల జిల్లాలో ఉత్తీర్ణత శాతం పెరుగుదల.

**జనం వాయిస్, జగిత్యాల, ఏప్రిల్ 15:**

జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ) విద్యార్థినులు ఇంటర్మీడియట్ పరీక్షల్లో విశిష్ట ఫలితాలు సాధించగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అభినందించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లతతో కలిసి ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను సత్కరించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో కేజీబీవీ రాయికల్‌కు చెందిన ఎస్. శ్రుతి 1000 మార్కులకు 988 మార్కులు సాధించి ప్రతిభ చాటుకుంది. అలాగే ప్రథమ సంవత్సరంలో కె. కార్తీక 500 మార్కులకు 492 మార్కులు సాధించి విశేష ప్రతిభ కనబరిచింది. ఈ ఫలితాలు జిల్లాకు గర్వకారణమని అధికారులు పేర్కొన్నారు. విద్యార్థినుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత, తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని కలెక్టర్ తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదల ఉంటే మరింత ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని విద్యార్థినులకు సూచించారు. ఈ సంవత్సరం ఫలితాలు గత సంవత్సరాలతో పోలిస్తే మెరుగ్గా ఉన్నాయని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలోని మొత్తం 12 కేజీబీవీలలో ప్రథమ సంవత్సరంలో 89.52 శాతం, ద్వితీయ సంవత్సరంలో 92.72 శాతం ఉత్తీర్ణత నమోదైందని తెలిపారు. విజేత విద్యార్థినులను ఈ సందర్భంగా సత్కరించి ప్రోత్సహించారు.




భవిష్యత్తులో ఇంకా మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి కె. రాము, సంబంధిత కోఆర్డినేటర్లు, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యా రంగంలో జిల్లాను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సమష్టిగా కృషి చేయాలని అధికారులు పేర్కొన్నారు.

RNI NO:TGTEL/26/A0383
దినపత్రిక జనం వాయిస్
తెలుగు దినపత్రిక
WWW.JANAMVOICE.COM

# టీడీపీలో భారీ పునర్వ్యవస్థీకరణ

- లోకేష్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కీలక బాధ్యతలు.
- పోలిట్‌బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలతో కొత్త దిశ.
- సామాజిక న్యాయం, మహిళలకు ప్రాధాన్యంతో నిర్మాణం.
- 2029 ఎన్నికల దృష్టితో వ్యూహాత్మక అడుగులు.



**జనం వాయిస్, అమరావతి, ఏప్రిల్ 15:**
తెలుగుదేశం పార్టీలో సంస్థాగత పునర్వ్యవస్థీకరణకు అధిష్ఠానం భారీ స్థాయిలో శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో అత్యంత కీలక నిర్ణయంగా ఏపీ మంత్రి నారా లోకేశ్ను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించింది. ఈ నిర్ణయం పార్టీ భవిష్యత్ నాయకత్వానికి దిశానిర్దేశం చేసే మైలురాయిగా భావిస్తున్నారు. ఈ మేరకు టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ పునర్వ్యవస్థీకరణలో భాగంగా 29 మందితో పొలిట్‌బ్యూరో, 31 మందితో జాతీయ కమిటీ, 185 మందితో రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేశారు. పార్టీకి విధేయంగా పని చేసిన నేతలకు, క్షేత్రస్థాయి కార్యకర్తలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వడం ఈ నిర్మాణంలో ప్రత్యేకతగా నిలిచింది. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రాస్‌రూట్ స్థాయి కార్యకర్తలకు కూడా అత్యున్నత పదవులు కట్టబెట్టడం పార్టీ లోపల కొత్త ఉత్సాహాన్ని నింపింది. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్ని రాజకీయ, సామాజిక సమీకరణాలను సమగ్రంగా విశ్లేషించి ఈ కసరత్తు చేసినట్లు పల్లా శ్రీనివాసరావు వెల్లడించారు. సీనియర్ల అనుభవాన్ని, యువత ఉత్సాహాన్ని సమతౌల్యంగా మేళవించేలా కమిటీలను రూపొందించారని తెలిపారు. ఈ మార్పులు పార్టీని మరింత చురుకుగా, సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేలా ఉంటాయని అభిప్రాయపడ్డారు. సామాజిక న్యాయానికి ఈ కమిటీల్లో అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. రాష్ట్ర కమిటీలోని 185 మంది సభ్యుల్లో 122 మంది బడుగు, బలహీన వర్గాలకు చెందినవారే కావడం విశేషం. ఇందులో బీసీలకు 77 (సుమారు 40%), ఎస్సీలకు 25, ఎస్టీలకు 7, మైనార్టీలకు 13 స్థానాలు కేటాయించారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలనే లక్ష్యంతో ఈ కూర్పు చేసినట్లు తెలిపారు. మహిళలకు కూడా ఈసారి ప్రత్యేక స్థానం కల్పించారు. రాష్ట్ర కమిటీలో 50 మంది మహిళలకు అవకాశం ఇవ్వగా, పొలిట్‌బ్యూరో, జాతీయ కమిటీల్లోనూ వారికి ప్రాధాన్యం ఇచ్చారు. రాబోయే కాలంలో మహిళా రిజర్వేషన్లు పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, నియోజకవర్గాల పునర్విభజన, రాజకీయ సమీకరణాల్లో వచ్చే మార్పులను అంచనా వేస్తూ ఈ కమిటీలను రూపొందించినట్లు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. నామినేటెడ్ పదవులు ఆశించిన వారికి కూడా న్యాయం చేసేలా ఈ నియామకాలు చేశామని అన్నారు. ఈ పునర్వ్యవస్థీకరణతో పార్టీ బలోపేతం అవుతుందని, రాష్ట్ర రాజకీయాల్లో టీడీపీ మరింత ప్రభావవంతంగా నిలుస్తుందని నాయకత్వం ధీమా వ్యక్తం చేసింది.

## ఉరవకొండలో 'అన్న క్యాంటీన్' ప్రారంభం

- పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం.
- మంత్రి పయ్యావుల కేశవ్ చేతుల మీదుగా ప్రారంభం.
- తక్కువ ధరలో భోజనం అందుబాటులోకి.





**జనం వాయిస్, అనంతపురం, ఏప్రిల్ 15:**
పేద ప్రజల ఆకలి తీర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'అన్న క్యాంటీన్' పథకం ఉరవకొండలో ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఈ క్యాంటీన్‌ను ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను మంత్రి ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పేదలకు తక్కువ ధరలో నాణ్యమైన ఆహారం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా రోజువారీ కూలీలు, నిరుపేదలు, రోగుల బంధువులు తక్కువ ఖర్చుతో భోజనం పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఆకలి బాధను తగ్గించడంలో ఈ క్యాంటీన్‌లు కీలకంగా మారుతాయని అన్నారు. అన్న క్యాంటీన్‌లో శుభ్రత, ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఇలాంటి పథకాల ద్వారా సామాజిక భద్రతను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. ఉరవకొండలో ప్రారంభమైన ఈ క్యాంటీన్ ద్వారా అనేక మంది పేదలకు ఉపశమనం కలగనుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకాన్ని మరింత విస్తరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

## ఏపీలో క్రీడల పురోగతికి 90 రోజుల ప్రణాళిక

**జనం వాయిస్, తిరుపతి, ఏప్రిల్ 15:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో క్రీడారంగానికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా క్రీడల అభివృద్ధి కోసం 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర విద్య, ఐటీ ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. తిరుపతి స్పోర్ట్స్ స్టేడియంలో బుధవారం జరిగిన ఒక ప్రత్యేక సమావేశంలో ఆయన జాతీయ అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులతో ముఖాముఖి నిర్వహించారు. క్రీడాకారుల సమస్యలు, మైదానాల నిర్వహణ మరియు శిక్షణ సౌకర్యాలపై వారి నుండి విలువైన సూచనలు సేకరించారు. రాష్ట్రంలోని క్రీడా మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు, గ్రామీణ స్థాయి నుండి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందించడమే ఈ 90 రోజుల ప్రణాళిక ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో మార్పు తీసుకువచ్చేలా నిపుణుల కమిటీ సూచనల మేరకు ఈ రోడ్‌మ్యాప్ రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రీడలను ఒక కెరీర్‌గా ఎంచుకునే యువతకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, అవసరమైన నిధులను తక్షణమే విడుదల చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని గుర్తు చేస్తూ, రాయలసీమ ప్రాంతంలో త్వరలోనే 'రాయలసీమ స్పోర్ట్స్ హబ్' కార్యరూపం దాల్చుతుందని లోకేష్ ప్రకటించారు. ఈ హబ్ ద్వారా చిత్తూరు, అనంతపురం, కడప మరియు కర్నూలు జిల్లాల క్రీడాకారులకు అధునాతన శిక్షణ కేంద్రాలు అందుబాటులోకి వస్తాయి. రాయలసీమను క్రీడల గడ్డగా మార్చాలన్నది తమ ప్రభుత్వ సంకల్పమని, ఇందుకోసం తిరుపతిని ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. విదేశీ కోచ్‌ల సహకారాన్ని కూడా తీసుకునే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో క్రీడా పాఠశాలలు మరియు అకాడమీలు నిర్లక్ష్యానికి గురయ్యాయని మంత్రి



ఆవేదన వ్యక్తం చేశారు. శిథిలావస్థకు చేరిన స్టేడియాలకు మరమ్మతులు చేయడంతో పాటు, ప్రతి నియోజకవర్గంలో ఒక మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మిస్తామని చెప్పారు. క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాలు మరియు ఉపాధి అవకాశాలలో రిజర్వేషన్లపై కూడా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. క్రీడారంగంలో రాజకీయ జోక్యం ఉండకూడదని, ప్రతిభకే ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న క్రీడాకారులు తమకు ఎదురవుతున్న ఆర్థిక ఇబ్బందులను, సాధన కోసం అవసరమైన పరికరాల కొరతను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన లోకేష్, వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ ప్రకారం ఆంధ్రప్రదేశ్‌ను క్రీడల రాజధానిగా మారుస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్రీడా శాఖ ఉన్నతాధికారులు, పలువురు ఒలింపియన్లు మరియు యువ క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తొలి పర్యటన

- చంద్రగిరిలో లోకేష్‌కు ఘన స్వాగతం.
- కార్యకర్తల ఉత్సాహం, నాయకత్వంపై నమ్మకం.
- పార్టీ అభివృద్ధికి కట్టుబడి ఉంటానన్న లోకేష్.





**జనం వాయిస్, తిరుపతి, ఏప్రిల్ 15:**
చంద్రగిరి నియోజకవర్గంలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశంలో మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపికైన తర్వాత తొలిసారిగా ఈ ప్రాంతానికి రావడంతో నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. లోకేష్ రాక సందర్భంగా కార్యకర్తలు భారీగా తరలివచ్చి పూలమాలలతో ఆయనను సత్కరించారు. నినాదాలతో కార్యక్రమ ప్రాంగణం మారుమోగింది. పార్టీ పట్ల ఉన్న విశ్వాసాన్ని ఈ కార్యక్రమం ప్రతిబింబించింది. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ తనపై పార్టీ అధిష్టానం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని హామీ ఇచ్చారు. కార్యకర్తలే పార్టీ బలమని, వారి సహకారంతో పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించే దిశగా పనిచేయాలని సూచించారు. రాష్ట్ర అభివృద్ధిలో తెలుగుదేశం పార్టీ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు మంచి పాలన అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. కార్యకర్తల ఉత్సాహం తనకు మరింత బాధ్యతను గుర్తు చేస్తోందని లోకేష్ అన్నారు. భవిష్యత్తులో మరింత సమర్థంగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.



## డీలిమిటేషన్‌పై సీఎం స్పందించాలి: వైఎస్ షర్మిల

- 2011 జనాభా ఆధారిత ప్రక్రియపై ఆందోళన.
- ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరుగుతుందన్న విమర్శ.
- ఏకగ్రీవంగా వ్యతిరేకించాలని పిలుపు.



**జనం వాయిస్, అమరావతి, ఏప్రిల్ 15:**
కేంద్రం ప్రతిపాదించిన 2011 జనాభా లెక్కల ఆధారిత డీలిమిటేషన్ ప్రక్రియపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ రాష్ట్ర ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీస్తుందని, రాజకీయ మరియు ఆర్థిక భవిష్యత్తుకు ముప్పుగా మారుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు బహిరంగ లేఖ రాస్తూ, డీలిమిటేషన్ అంశాన్ని అత్యవసర పరిస్థితిగా పరిగణించాలని కోరారు. ఈ ప్రతిపాదన వల్ల ఆంధ్రప్రదేశ్ తన స్వరాన్ని మాత్రమే కాదు, వేల కోట్ల రూపాయల ఆర్థిక అవకాశాలను కూడా కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దక్షిణ రాష్ట్రాలకు అన్యాయం జరిగేలా ఉన్న ఈ డీలిమిటేషన్ ప్రతిపాదనను బహిరంగంగా వ్యతిరేకించాలని సీఎం చంద్రబాబును కోరారు. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణలో ప్రభుత్వం స్పష్టమైన వైఖరి తీసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 25 లోక్‌సభ, 11 రాజ్యసభ సభ్యులను పార్టీ భేదాలు లేకుండా ఏకతాటిపైకి తీసుకువచ్చి, పార్లమెంటులో ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో అన్ని పార్టీలూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ అంశంపై చర్చించేందుకు అత్యవసరంగా ఒకరోజు ప్రత్యేక శాసనసభ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని షర్మిల సూచించారు. ప్రతిపాదిత డీలిమిటేషన్ ఫ్రేమ్‌వర్క్‌ను తిరస్కరించే తీర్మానం ఆమోదించి, కేంద్ర ప్రభుత్వానికి పంపాలని డిమాండ్ చేశారు. ఇది కేవలం రాజకీయ నిర్ణయం మాత్రమే కాకుండా ప్రజల హక్కులను కాపాడే రాజ్యాంగ బాధ్యతగా చూడాలని షర్మిల స్పష్టం చేశారు. భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని ఆమె కోరారు.

# జాతీయ రహదారులపై కొత్త టోల్ నిబంధనలు

దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై టోల్ విధానంలో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులు అమలు చేసింది. ముఖ్యంగా ఓవర్‌లోడ్‌తో వెళ్లే వాణిజ్య వాహనాలపై కఠిన చర్యలు తీసుకునే కొత్త నిబంధనలు నేటి నుంచే అమల్లోకి వచ్చాయి. ఈ మార్పులతో పరిమితికి మించి లోడ్‌తో వెళ్లే వాహనాలపై భారీ జరిమానాలు విధించనున్నారు. ఈ మేరకు భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో కొత్త విధానం అమలు అవుతోంది. కేంద్ర రవాణా శాఖ తీసుకొచ్చిన తాజా సవరణ నిబంధనల ప్రకారం, వాహనాలు అనుమతించిన లోడ్ పరిమితిని దాటితే అదనపు టోల్ రుసుము విధించనున్నారు. నిబంధనల ప్రకారం 10 శాతం వరకు ఓవర్‌లోడ్ ఉన్న వాహనాలకు జరిమానా ఉండదు. అయితే 10 నుంచి 40 శాతం వరకు అధిక లోడ్ ఉంటే సాధారణ టోల్ ఫీజుకు రెండింతలు వసూలు చేస్తారు. 40 శాతం కంటే ఎక్కువ ఓవర్‌లోడ్ ఉంటే నాలుగు రెట్లు వరకు జరిమానా విధించనున్నారు. ఈ జరిమానాలను కూడా తప్పనిసరిగా డిజిటల్ విధానంలోనే చెల్లించాలి. టోల్ ప్లాజాల వద్ద డిజిటల్ తూకం పరికరాలను ఏర్పాటు చేసే ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. ఈ పరికరాలు అందుబాటులో ఉన్న చోట్ల మాత్రమే ఓవర్‌లోడ్ తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించనున్నారు. ఈ చర్యల ద్వారా రహదారుల పరిరక్షణ, ప్రమాదాల నివారణ లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇక టోల్ చెల్లింపుల విషయంలో కూడా మార్పులు తీసుకొచ్చారు. నగదు చెల్లింపులను పూర్తిగా నిలిపివేసి, ఫాస్టాగ్ మరియు యూపీఐ వంటి డిజిటల్ మార్గాల ద్వారా మాత్రమే టోల్ రుసుములు స్వీకరిస్తున్నారు. టోల్ చెల్లించకుండా వెళ్లే వాహనాలపై కూడా కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. మొత్తంగా ఈ కొత్త నిబంధనలు వాహనదారులు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందని అధికారులు సూచిస్తున్నారు. రహదారి భద్రత, మౌలిక సదుపాయాల పరిరక్షణ కోసం తీసుకున్న ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా ప్రభావం చూపనుంది.




# యూపీఐ చెల్లింపులకు కొత్త నిబంధనలు




డిజిటల్ చెల్లింపుల్లో విస్తృతంగా వినియోగంలో ఉన్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త మార్పులకు శ్రీకారం చుట్టింది. యూపీఐ ద్వారా రూ.10 వేలకుపైగా నగదు పంపినప్పుడు ఒక గంట పాటు 'వెయిటింగ్ సమయం' అమలు చేయాలనే ప్రతిపాదనపై తాజాగా వివరణ ఇచ్చింది. ప్రస్తుతం యూపీఐ ద్వారా చెల్లింపులు క్షణాల్లో పూర్తవుతుండగా, సైబర్ మోసాలను అరికట్టే లక్ష్యంతో ఈ కొత్త నిబంధనలను తీసుకురావాలని భావిస్తున్నారు. ఈ ప్రతిపాదన ప్రకారం, కొత్తగా ఎవరైనా లబ్ధిదారునికి రూ.10 వేలకుపైగా నగదు పంపితే, ఆ లావాదేవీ వెంటనే పూర్తికాకుండా ఒక గంట తర్వాతే ఆ మొత్తము లబ్ధిదారుడి ఖాతాలో జమ అవుతుంది. అయితే ఈ నిబంధనకు కొన్ని మినహాయింపులు కూడా ఉన్నాయి. ఇప్పటికే నమోదైన లబ్ధిదారులకు లేదా వ్యాపారులకు చెల్లింపులు చేస్తే ఎలాంటి ఆలస్యం ఉండదు. అలాగే వినియోగదారులు తమకు నమ్మకమైన వ్యక్తులను ముందుగానే 'వైట్ లిస్ట్'లో చేర్చుకుంటే, వారికి చేసే చెల్లింపులు వెంటనే పూర్తవుతాయి. కొత్త లబ్ధిదారులకు మాత్రమే ఈ వెయిటింగ్ సమయం వర్తిస్తుంది. ఈ మార్పులపై బ్యాంకులు, ఆర్థిక సాంకేతిక సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. యూపీఐ చెల్లింపుల వేగమే దీనికి ప్రధాన ఆకర్షణగా ఉండగా, ఒక గంట ఆలస్యం చేయడం వల్ల వినియోగదారులు నగదు లావాదేవీల వైపు మళ్లే అవకాశముందని వారు భావిస్తున్నారు. ఇక నిపుణులు కూడా ఈ నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. సైబర్ మోసాలను తగ్గించేందుకు చర్యలు అవసరమే అయినప్పటికీ, చెల్లింపులను ఆలస్యం చేయడం కంటే మోసగాళ్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. మొత్తంగా చూస్తే ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే యూపీఐ లావాదేవీలపై గణనీయమైన ప్రభావం పడే అవకాశముంది. వేగవంతమైన డిజిటల్ చెల్లింపుల వ్యవస్థపై ఇది ఎలాంటి ప్రభావం చూపుతుందో చూడాల్సి ఉంది.

# రైలులో నిశ్శబ్ద నిబంధనలు

రైలు ప్రయాణంలో తోటి ప్రయాణికుల ప్రశాంతతకు భంగం కలిగించే వారిపై భారతీయ రైల్వే కఠిన చర్యలకు సిద్ధమైంది. ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే శాఖ కొత్త నిబంధనలు అమలు చేస్తోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో గట్టిగా మాట్లాడటం, మొబైల్ ఫోన్లలో లౌడ్ స్పీకర్‌తో పాటలు వినడం వంటి చర్యలపై నియంత్రణ విధించింది. ఈ మేరకు రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు సమయాన్ని 'నిశ్శబ్ద సమయం'గా ప్రకటించారు. ఈ సమయంలో ప్రయాణికులు మొబైల్ ఫోన్లలో పాటలు వినాలంటే తప్పనిసరిగా ఇయర్‌ఫోన్లు ఉపయోగించాలి. లౌడ్ స్పీకర్‌లో పాటలు వినడం, సినిమాలు చూడడం పూర్తిగా నిషేధం. అలాగే ఇతరులకు ఇబ్బంది కలగకుండా ఫోన్ సంభాషణలు కూడా తక్కువ స్వరంతో నిర్వహించాల్సి ఉంటుంది. ఇక రాత్రి 10 గంటల తర్వాత కోచ్‌లలో నైట్ లాంప్ మినహా మిగతా లైట్లు ఆఫ్ చేయడం తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనగా పేర్కొన్నారు. ఈ చర్యల ద్వారా ప్రయాణికులకు సుఖమైన నిద్ర వాతావరణాన్ని కల్పించాలనే ఉద్దేశంతో రైల్వే శాఖ ముందుకొచ్చింది.ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై రైల్వే చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోనున్నారు. పరిస్థితి తీవ్రతను బట్టి భారీ జరిమానా విధించడం తో పాటు జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉంది. ప్రయాణికులకు అసౌకర్యం కలిగించే వ్యక్తులపై వెంటనే చర్యలు తీసుకునేందుకు ప్రత్యేకంగా పర్యవేక్షణ కూడా పెంచుతున్నారు. ప్రయాణ సమయంలో ఎవరైనా ఈ నియమాలను ఉల్లంఘిస్తే, వెంటనే రైల్వే సిబ్బందికి లేదా సహాయ కేంద్రం 139 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు అందిన వెంటనే రైల్వే సిబ్బంది లేదా భద్రతా సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని తగిన చర్యలు తీసుకుంటారు. ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా, ప్రశాంతంగా మార్చేందుకు తీసుకున్న ఈ నిర్ణయాన్ని సాధారణ ప్రయాణికులు స్వాగతిస్తున్నారు.




# ఎయిరిండియాకు భారీ నష్టం

ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా ఈ ఆర్థిక సంవత్సరంలో భారీ నష్టాలను చవిచూస్తున్నట్లు సమాచారం. తాజా అంచనాల ప్రకారం సంస్థకు దాదాపు రూ.22,000 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. ఈ పరిణామం సంస్థ భవిష్యత్తుపై ఆందోళనలు కలిగిస్తోంది. అంతర్జాతీయ పరిస్థితుల మార్పులు, ఇంధన ధరల పెరుగుదల, నిర్వహణ ఖర్చుల అధికత వంటి కారణాలు ఈ నష్టాలకు ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు. విమానయాన రంగంలో పెరుగుతున్న పోటీ కూడా సంస్థ ఆదాయంపై ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో ఆర్థిక ఒత్తిడి మరింత పెరిగే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు సంస్థ యాజమాన్యం కొత్త ఆర్థిక వనరుల సమీకరణపై దృష్టి సారించింది. ముఖ్యంగా ప్రధాన వాటాదారుల సహకారంతో సంస్థను పునర్నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా టాటా సన్స్ మరియు సింగపూర్ ఎయిర్‌లైన్స్ సంస్థలతో చర్చలు కొనసాగుతున్నట్లు సమాచారం. సంస్థ కార్యకలాపాలను సుస్థిరం చేయడం, విమాన సేవలను ఆధునీకరించడం, సేవల నాణ్యతను మెరుగుపరచడం వంటి లక్ష్యాలతో ఈ పెట్టుబడులు వినియోగించబడనున్నాయి. వాటాదారుల నుంచి లభించే ఆర్థిక మద్దతు సంస్థకు పునరుత్థానానికి కీలకంగా మారుతుందని నిపుణులు భావిస్తున్నారు. మొత్తంగా ఈ ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించేందుకు ఎయిరిండియా తీసుకుంటున్న చర్యలు భవిష్యత్తులో సంస్థ పనితీరుపై కీలక ప్రభావం చూపనున్నాయని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.




# ఆశాజనకంగా మిర్చి ధరలు

తెలంగాణ రాష్ట్రంలో మిర్చి ధరలు ఈ సీజన్‌లో గణనీయంగా పెరిగి రైతులకు ఊరటనిస్తున్నాయి. ముఖ్యంగా ఖమ్మం, వరంగల్ వ్యవసాయ మార్కెట్లలో మిర్చి ధరలు భారీగా పెరగడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది తేజా రకం ఎండు మిర్చికి మంచి డిమాండ్ ఏర్పడింది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో తేజా మిర్చి క్వింటా రూ.21,000 వరకు పలకగా, ఏసీ రకం మిర్చి రూ.21,580 వరకు ధర సాధించింది. విదేశీ మార్కెట్ల నుంచి, ముఖ్యంగా చైనా నుంచి ఆర్డర్లు పెరగడంతో అంతర్జాతీయ డిమాండ్ గణనీయంగా పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. ఇక ప్రీమియం రకాలైన టమాటా మిర్చి, ఎల్లో మిర్చి ధరలు మరింత ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. ఈ రకాల మిర్చి క్వింటా ధర రూ.40,000 నుంచి రూ.50,000 వరకు చేరుకోవడం గమనార్హం. చపాట మిర్చి కూడా అధిక ధరలు నమోదు చేస్తూ రైతులకు లాభాలను అందిస్తోంది. ఈ సీజన్ ప్రారంభమైన జనవరి 1 నుంచి ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సుమారు 13 లక్షల మిర్చి బస్తాలు వచ్చాయి. సీజన్ ముగిసే నాటికి మరో మూడు లక్షల బస్తాలు వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఏడాది ఖమ్మం మార్కెట్‌కు 34 లక్షలకు పైగా మిర్చి బస్తాలు చేరాయి. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ధరల్లో భారీ పెరుగుదల కనిపిస్తోంది. అప్పట్లో మిర్చి ధర క్వింటాకు రూ.12,500 నుంచి రూ.14,000 వరకు మాత్రమే ఉండగా, ప్రస్తుతం దాదాపు రెట్టింపు స్థాయికి చేరుకుంది. పంట నాణ్యత మెరుగ్గా ఉండడం, అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ పెరగడం, ఇతర రాష్ట్రాల్లో సాగు తగ్గడం వంటి కారణాలు ఈ ధరల పెరుగుదలకు దోహదం చేస్తున్నాయి. మొత్తంగా ఈ సీజన్‌లో మిర్చి రైతులకు మార్కెట్ పరిస్థితులు అనుకూలంగా మారి, మంచి ఆదాయం వచ్చే సూచనలు కనిపిస్తున్నాయని వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు.






# వాహనాల ధరలు మళ్లీ పెరుగుతాయా?

ఇప్పటికే వాహనాల నిర్వహణ ఖర్చులు పెరిగి సామాన్యుడిపై భారం పెరుగుతున్న వేళ, మరోసారి వాహనాల ధరలు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయంగా నెలకొన్న యుద్ధ పరిస్థితులు, ముడి సరుకుల ధరల పెరుగుదల కారణంగా ఆటోమొబైల్ రంగంపై ఒత్తిడి పెరిగినట్లు సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ అధ్యక్షుడు శైలేశ్ చంద్ర తెలిపారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు సరఫరా వ్యవస్థను దెబ్బతీస్తున్నాయి. ముఖ్యంగా వాహనాల తయారీలో ఉపయోగించే లోహాలు, ఇతర ముడి పదార్థాల ధరలు గణనీయంగా పెరిగాయి. ఈ పరిస్థితి వాహన తయారీ సంస్థలపై అదనపు భారం మోపుతోంది. ఇప్పటికే కొన్ని సంస్థలు వాహనాల ధరలను పెంచినప్పటికీ, ఖర్చులు ఇలాగే కొనసాగితే మరో విడత ధరల పెంపు తప్పదని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా ఉక్కు, అల్యూమినియం వంటి ముడి పదార్థాల ధరలు పెరగడం, రవాణా ఖర్చులు అధికమవడం, అంతర్జాతీయ సరఫరా గొలుసులో అంతరాయాలు ఏర్పడటం వంటి అంశాలు వాహన తయారీ వ్యయాన్ని పెంచుతున్నాయి. దీంతో తయారీదారులు తమ లాభాలను నిలబెట్టుకోవడానికి ధరలను సవరించే దిశగా ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రాబోయే నాలుగు నుంచి ఐదు వారాల్లో పరిస్థితులపై స్పష్టత వచ్చే అవకాశముందని శైలేశ్ చంద్ర తెలిపారు. ముడి సరుకుల ధరలు, అంతర్జాతీయ పరిస్థితుల మార్పులను పరిశీలించిన తరువాతే వాహనాల ధరల పెంపుపై తుది నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే మధ్యతరగతి ప్రజలపై, ముఖ్యంగా కొత్త వాహనాలు కొనుగోలు చేయాలని భావిస్తున్నవారిపై అదనపు ఆర్థిక భారం పడే అవకాశం ఉంది. ఇప్పటికే ఇంధన ధరలు, నిర్వహణ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో వాహన కొనుగోలు నిర్ణయాన్ని వాయిదా వేసే పరిస్థితులు కూడా ఏర్పడవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా చూస్తే అంతర్జాతీయ పరిస్థితులు స్థిరపడకపోతే వాహనాల ధరలు మళ్లీ పెరగడం ఖాయమని పరిశ్రమ వర్గాలు సూచిస్తున్నాయి.



# టీ20 విజేతలకు నాడా నిఘా

2026 టీ20 ప్రపంచకప్‌లో భారత్‌కు విజయం అందించిన జట్టులోని కీలక ఆటగాళ్లపై జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ నాడా నిఘా పెంచింది. క్రీడల్లో పారదర్శకతను కాపాడేందుకు ఇద్దరు ప్రముఖ క్రికెటర్లను రిజిస్టర్డ్ టెస్టింగ్ పూల్‌లో చేర్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ పరిణామం క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలో ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు వరుస విజయాలతో చరిత్ర సృష్టించిన నేపథ్యంలో, ఈ చర్యకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ప్రస్తుతం లీగ్ పోటీల్లో బిజీగా ఉన్న ఆటగాళ్లను కూడా ఈ జాబితాలో చేర్చడం గమనార్హం. ఈ టెస్టింగ్ పూల్‌లో ఉన్న క్రీడాకారులు ప్రతిరోజూ తమ నివాస వివరాలను ముందుగానే నాడాకు తెలియజేయాలి. ఎప్పుడైనా అధికారులు వచ్చి రక్తం లేదా మూత్ర నమూనాలు సేకరించే అవకాశం ఉంటుంది. ఒక ఆటగాడు వరుసగా మూడు సార్లు వివరాలు ఇవ్వకపోతే, అది నిబంధనల ఉల్లంఘనగా పరిగణించి కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. తాజాగా ఈ జాబితాలో అభిషేక్ శర్మ, అక్షర్ పటేల్‌లను చేర్చారు. గతంలో ఉన్న స్మృతి మంధాన, శ్రేయస్ అయ్యర్ స్థానంలో వీరిని ఎంపిక చేసినట్లు సమాచారం. ప్రపంచకప్ విజయానంతరం ఈ ఇద్దరూ తమ తమ ఫ్రాంచైజీలకు ప్రాతినిధ్యం వహిస్తూ బిజీగా ఉన్నారు. ఇక నాడా నిఘాలో ఉన్న ఇతర ప్రముఖ క్రికెటర్లలో శుభ్‌మన్ గిల్, హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బుమ్రా, యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, రిషబ్ పంత్, తిలక్ వర్మ, అర్ష్‌దీప్ సింగ్ వంటి ఆటగాళ్లు కూడా ఉన్నారు. క్రీడా స్ఫూర్తిని కాపాడటం కోసం ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

# హైదరాబాద్ మ్యాచ్‌కు ధోని రెడీ?

ఐపీఎల్ 2026లో వరుస విజయాలతో దూసుకుపోతున్న చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు శుభవార్త అందింది. జట్టు దిగ్గజ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనీ గాయం నుంచి కోలుకుని త్వరలోనే మైదానంలోకి తిరిగి రావచ్చని సమాచారం. సన్‌రైజర్స్‌తో జరగనున్న కీలక మ్యాచ్‌కు ఆయన అందుబాటులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం, ధోనీ కాలి కండరాల గాయం నుంచి దాదాపు పూర్తిగా కోలుకున్నాడు. తుది ఫిట్‌నెస్ పరీక్ష అనంతరం ఆయన హైదరాబాద్ ప్రయాణంపై స్పష్టత రానుంది. ఒకవేళ అతను జట్టులోకి తిరిగి వస్తే, అది చెన్నైకు భారీ బలం కావడం ఖాయం. ఈ సీజన్ ఆరంభంలో ధోనీ లేని లోటును భర్తీ చేయడానికి సంజూ శాంసన్ వికెట్ కీపింగ్ బాధ్యతలు నిర్వహించాడు. అయితే ధోనీ తిరిగి వస్తే, వికెట్ల వెనుక తన చురుకుదనంతో మళ్లీ మెరుపులు మెరిపించనున్నాడు. మైదానంలో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు అతను ఇచ్చే సూచనలు జట్టు విజయాల్లో కీలకంగా మారనున్నాయి. వికెట్ కీపింగ్‌తో పాటు ఫినిషర్‌గా కూడా ధోనీ తన విలువను నిరూపిస్తున్నాడు. గత సీజన్లలో అతని దూకుడు బ్యాటింగ్ జట్టుకు ఎన్నో విజయాలు అందించింది. ప్రస్తుతం మధ్యతరగతి బ్యాటింగ్‌ను బలోపేతం చేయాలంటే ధోనీ రాక ఎంతో కీలకమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక వరుస విజయాలతో ఉత్సాహంగా ఉన్న



చెన్నై జట్టు, అదే జోరును కొనసాగించేందుకు సిద్ధమైంది. ఏప్రిల్ 18న హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో సన్‌రైజర్స్‌తో ఈ పోరు జరగనుంది. ధోనీ తిరిగి బరిలోకి దిగుతాడా లేదా అన్నది అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# సూర్య కెప్టెన్సీపై ముప్పు

భారత టీ20 జట్టు సారథి సూర్యకుమార్ యాదవ్ కెరీర్ ప్రస్తుతం కీలక దశలో ఉంది. జట్టును విజయపథంలో నడిపించినప్పటికీ, వ్యక్తిగతంగా బ్యాటింగ్‌లో స్థిరమైన ప్రదర్శన ఇవ్వలేకపోవడం అతని నాయకత్వంపై సందేహాలు రేకెత్తిస్తోంది. తాజాగా జరుగుతున్న లీగ్ పోటీల్లో కూడా అతను పరుగులు సాధించడంలో ఇబ్బంది పడుతున్నాడు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని బీసీసీఐ భవిష్యత్ ప్రణాళికలపై దృష్టి సారించింది. రాబోయే కీలక టోర్నమెంట్‌లను దృష్టిలో పెట్టుకుని కొత్త నాయకత్వాన్ని తయారు చేయాలనే ఆలోచనలో ఉందని సమాచారం. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మద్దతు ఉన్నప్పటికీ, మైదానంలో ఆటగాడిగా రాణించడం ఇప్పుడు సూర్యకు అత్యవసరమైంది. త్వరలో జరిగే ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలు అతనికి కీలకంగా మారనున్నాయి. ఈ సిరీస్‌లలో మెరుగైన ప్రదర్శన ఇస్తేనే కెప్టెన్సీ కొనసాగించే అవకాశాలు ఉంటాయి. లేదంటే నాయకత్వ మార్పు అనివార్యమవుతుందని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి. ఇదిలా ఉండగా, కొత్త సారథి రేసులో అక్షర్ పటేల్ ముందంజలో ఉన్నాడు. అతనితో పాటు శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. వీరి ప్రదర్శనలను ఆధారంగా చేసుకుని తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. భవిష్యత్ లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని తీసుకునే ఈ నిర్ణయం భారత జట్టు మార్గాన్ని నిర్ణయించనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# లాహోర్ దాడి జ్ఞాపకాలు.. సంగక్కర భావోద్వేగం



శ్రీలంక క్రికెట్ దిగ్గజం కుమార సంగక్కర 17 ఏళ్ల క్రితం జరిగిన లాహోర్ ఉగ్రదాడి 2009 ఘటనను మరోసారి గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఆ భయానక సంఘటన తన జీవిత దృక్పథాన్నే మార్చేసిందని వెల్లడించారు. 2009 మార్చి 3న పాకిస్థాన్‌లోని లాహోర్‌లో గడ్డాఫీ స్టేడియం సమీపంలో శ్రీలంక జట్టు బస్సుపై ఉగ్రవాదులు దాడి చేశారు. ఈ ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోగా, సంగక్కరతో పాటు జట్టులోని మరికొందరు ఆటగాళ్లు గాయపడ్డారు. ఈ దాడి తర్వాత పాకిస్థాన్‌లో అంతర్జాతీయ క్రికెట్ చాలా కాలం నిలిచిపోయింది. దాడికి ముందు జరిగిన సంఘటనను సంగక్కర గుర్తుచేసుకుంటూ, బస్సులో సహచర ఆటగాడు సరదాగా చెప్పిన మాట నిమిషంలోనే నిజమైన భయంకర పరిస్థితిగా మారిందన్నారు. "బాంబు పేలితే ఇంటికి వెళ్లిపోదామని అన్న మాట తరువాత వెంటనే దాడి జరిగింది" అని తెలిపారు. ఆ దాడిలో తాను గాయపడ్డానని, ఇప్పటికీ తన శరీరంలో తుపాకీ గుళ్ల శకలాలు ఉన్నాయని సంగక్కర వెల్లడించారు. ఈ అనుభవం తనలో యుద్ధ పరిస్థితులపై లోతైన అవగాహనను కలిగించిందని చెప్పారు. తరువాత శ్రీలంకలో ఓ సైనికుడితో జరిగిన సంభాషణ తనను మరింత కదిలించిందని తెలిపారు. "మేము ఆట కోసం మాత్రమే మైదానంలో ఉంటాం. కానీ సైనికులు దేశ రక్షణ కోసం ప్రతిరోజూ ప్రాణాల పణంగా పెట్టి పోరాడుతుంటారు" అన్న సైనికుడి మాటలు తనలో పెద్ద మార్పు తీసుకొచ్చాయని పేర్కొన్నారు. ఈ ఘటనను తలచుకుంటే ఇప్పటికీ గుండె దడపడుతుందని, జీవితం విలువను అర్థం చేసుకునేలా చేసిన సంఘటనగా ఇది నిలిచిపోయిందని సంగక్కర అన్నారు.

# భారీ ధర ఆటగాడిపై సెహ్వాగ్ విమర్శలు



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌లో వరుస ఓటములతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కోల్‌కతా నైట్ రైడర్స్‌పై మాజీ భారత ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జట్టు తీసుకున్న కొన్ని నిర్ణయాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. ప్రత్యేకంగా ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్‌పై భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టడం జట్టుకు మైనస్‌గా మారిందని సెహ్వాగ్ అభిప్రాయపడ్డారు. ఐపీఎల్ వేలంలో దాదాపు రూ.25 కోట్లకు పైగా ఖర్చు చేసి అతడిని తీసుకోవడం సరైన నిర్ణయం కాదని పేర్కొన్నారు. ప్రస్తుతం గ్రీన్ ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేకపోవడంతో జట్టుకు ఉపయోగం లేకుండా పోతున్నాడని సెహ్వాగ్ అన్నారు. బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ అతడు ప్రభావం చూపలేకపోతున్నాడని విమర్శించారు. అవసరమైతే అతడిని తుది జట్టులో నుంచి తప్పించి ఇతర ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలని సూచించారు. జట్టు చేసిన తప్పును ఒప్పుకోవడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదని, ప్రస్తుత పరిస్థితుల్లో సరైన నిర్ణయాలు తీసుకోవడం అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఆడిన మ్యాచ్‌ల్లో ఒక్క విజయం కూడా నమోదు చేయలేకపోయిన కోల్‌కతా జట్టు పాయింట్ల పట్టికలో అట్టడుగున కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో జట్టు వ్యూహాల్లో మార్పులు చేయకపోతే పరిస్థితి మరింత క్లిష్టమవుతుందని క్రీడా నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌లో వరుస ఓటములతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కోల్‌కతా నైట్ రైడర్స్‌పై మాజీ భారత ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జట్టు తీసుకున్న కొన్ని నిర్ణయాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. ప్రత్యేకంగా ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్‌పై భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టడం జట్టుకు మైనస్‌గా మారిందని సెహ్వాగ్ అభిప్రాయపడ్డారు. ఐపీఎల్ వేలంలో దాదాపు రూ.25 కోట్లకు పైగా ఖర్చు చేసి అతడిని తీసుకోవడం సరైన నిర్ణయం కాదని పేర్కొన్నారు. ప్రస్తుతం గ్రీన్ ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేకపోవడంతో జట్టుకు ఉపయోగం లేకుండా పోతున్నాడని సెహ్వాగ్ అన్నారు. బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ అతడు ప్రభావం చూపలేకపోతున్నాడని విమర్శించారు. అవసరమైతే అతడిని తుది జట్టులో నుంచి తప్పించి ఇతర ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలని సూచించారు. జట్టు చేసిన తప్పును ఒప్పుకోవడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదని, ప్రస్తుత పరిస్థితుల్లో సరైన నిర్ణయాలు తీసుకోవడం అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఆడిన మ్యాచ్‌ల్లో ఒక్క విజయం కూడా నమోదు చేయలేకపోయిన కోల్‌కతా జట్టు పాయింట్ల పట్టికలో అట్టడుగున కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో జట్టు వ్యూహాల్లో మార్పులు చేయకపోతే పరిస్థితి మరింత క్లిష్టమవుతుందని క్రీడా నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# హిట్‌మ్యాన్ గాయం ఆందోళన అవసరం లేదు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌లో వరుస ఓటములతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ముంబై ఇండియన్స్‌కు ఊరటనిచ్చే వార్త వచ్చింది. జట్టు స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ గాయం తీవ్రంగా లేదని వైద్య పరీక్షల్లో తేలింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో ఛేజింగ్ సమయంలో రోహిత్ శర్మ 13 బంతుల్లో 19 పరుగులు చేసి మంచి లయలో కనిపించాడు. అయితే ఆ సమయంలో అకస్మాత్తుగా కండరాల నొప్పి (మసిల్ క్రాంప్) రావడంతో నొప్పిని భరించలేక రిటైర్డ్ హర్ట్‌గా మైదానాన్ని వీడాల్సి వచ్చింది. రోహిత్ అకస్మాత్తుగా బయటకు వెళ్లడం ముంబై జట్టు బ్యాటింగ్‌పై ప్రభావం చూపింది. భారీ లక్ష్యాన్ని ఛేజ్ చేస్తూ వచ్చిన ముంబై చివరకు 222 పరుగుల వద్దే ఆగిపోయి ఓటమిని చవిచూసింది. మ్యాచ్ అనంతరం నిర్వహించిన వైద్య పరీక్షల్లో గాయం తీవ్రమైనది కాదని, ఎలాంటి కండరాల చీలిక లేదని నిర్ధారణ అయ్యింది. దీంతో అభిమానులు కొంత ఊరట పొందుతున్నారు. అయితే జట్టు మేనేజ్‌మెంట్ జాగ్రత్తగా వ్యవహరించే అవకాశం ఉంది. తదుపరి మ్యాచ్‌లో రోహిత్ ఆడుతాడా లేదా అన్నది ఇంకా స్పష్టత లేకపోయినా, ఎక్కువ మ్యాచ్‌లకు దూరం కావాల్సిన పరిస్థితి లేదని సమాచారం. మొత్తంగా హిట్‌మ్యాన్ త్వరలోనే మళ్లీ మైదానంలోకి దిగే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.



# చెపాక్‌లో సీఎస్కే సూపర్ రికార్డు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌లో ఆరంభంలో వరుస ఓటములతో నిరాశపరిచిన చెన్నై సూపర్ కింగ్స్ ఇప్పుడు వరుస విజయాలతో మళ్లీ ఫామ్‌లోకి వచ్చింది. చెపాక్ మైదానంలో కోల్‌కతా జట్టుపై సాధించిన తాజా విజయం ఈ సీజన్‌లో ప్రత్యేక రికార్డుగా నిలిచింది. కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సీఎస్కే కేవలం 193 పరుగుల లక్ష్యాన్ని కాపాడుకుని విజయం సాధించడం విశేషం. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 200 పరుగుల లోపు లక్ష్యాన్ని ఎలాంటి జట్టూ డిఫెండ్ చేయలేకపోయిన నేపథ్యంలో, సీఎస్కే ఈ ఘనత సాధించడం కీలకంగా మారింది. మ్యాచ్ ప్రారంభంలో బ్యాటింగ్‌కు అనుకూలంగా కనిపించిన పిచ్, మధ్యలో నెమ్మదించడంతో పరుగులు చేయడం కష్టమైంది. సీఎస్కే తొలి 11 ఓవర్లలో వేగంగా పరుగులు సాధించినప్పటికీ, చివరికి 200 పరుగుల మార్క్‌ను అందుకోలేకపోయింది. అయినప్పటికీ బౌలర్లు అద్భుత ప్రదర్శనతో జట్టును గెలిపించారు. కోల్‌కతా జట్టు తరఫున అజింక్య రహానే, ఫిన్ అలెన్, రింకూ సింగ్ వంటి బ్యాటర్లు ఉన్నప్పటికీ లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు. సీఎస్కే బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి కేకేఆర్‌ను 160 పరుగులకే కట్టడి చేశారు. స్పిన్‌కు అనుకూలంగా మారిన చెపాక్ పిచ్‌పై నూర్ అహ్మద్, అకేలా హొసేన్ అద్భుతంగా బౌలింగ్ చేసి ప్రత్యర్థి మిడిల్ ఆర్డర్‌ను కూల్చేశారు. పేస్ విభాగంలో ఖలీల్ అహ్మద్ కూడా కీలక పాత్ర పోషించాడు. మొత్తంగా సీఎస్కే జట్టు సమిష్టి



ప్రదర్శనతో 32 పరుగుల తేడాతో విజయం సాధించి, చెపాక్‌లో మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ఈ విజయం తర్వాత జట్టు మళ్లీ ట్రాక్‌లోకి వచ్చిందని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# రహానేకు జరిమానా

ఇండియన్ ప్రీమియర్ లీగ్లో కోల్‌కతా జట్టు కెప్టెన్ అజింక్య రహానేకు జరిమానా విధించారు. చెన్నై జట్టుతో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా ఆయనపై రూ. 12 లక్షల జరిమానా పడింది. కోల్‌కతా నైట్ రైడర్స్ మరియు చెన్నై సూపర్ కింగ్స్ మధ్య జరిగిన ఈ మ్యాచ్‌లో కోల్‌కతా నిర్ణీత సమయానికి ఓవర్లు పూర్తి చేయలేకపోయింది. దీనిని ఉల్లంఘనగా పరిగణించిన నిర్వాహకులు రహానేపై చర్యలు తీసుకున్నారు. ఐపీఎల్ నిబంధనల ప్రకారం స్లో ఓవర్ రేట్‌కు సంబంధించి మొదటి తప్పిదంగా పరిగణిస్తూ ఈ జరిమానా విధించినట్లు వెల్లడించారు. ఈ మ్యాచ్‌లో కోల్‌కతా జట్టు 32 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ప్రస్తుత సీజన్‌లో ఆ జట్టు ప్రదర్శన నిరాశాజనకంగా కొనసాగుతోంది. ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా గెలవలేకపోవడం అభిమానుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని సంబంధిత నిబంధనల ప్రకారం ఈ జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. ఇక కోల్‌కతా



జట్టు తన తదుపరి మ్యాచ్‌ను గుజరాత్ టైటాన్స్‌తో ఆడనుంది. ఈ మ్యాచ్‌లోనైనా జట్టు విజయాన్ని నమోదు చేస్తుందా అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.

# స్లో ఓవర్ రేట్‌పై అంపైర్లకే జరిమానా: ఫ్రేజర్ స్టీవార్ట్

ఇండియన్ ప్రీమియర్ లీగ్లో స్లో ఓవర్ రేట్ సమస్యపై మెరిలిబోన్ క్రికెట్ క్లబ్ అధిపతి ఫ్రేజర్ స్టీవార్ట్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆటగాళ్లకు మాత్రమే జరిమానాలు విధించడం సరైంది కాదని, అంపైర్లకూ అదే నిబంధనలు వర్తింపజేయాలని సూచించారు. ప్రస్తుతం స్లో ఓవర్ రేట్ ఉల్లంఘనలకు జట్ల కెప్టెన్లపై భారీ జరిమానాలు విధిస్తున్నారు. మొదటిసారి రూ. 12 లక్షలు, రెండోసారి రూ. 24 లక్షలు, మూడోసారి రూ. 30 లక్షల వరకు జరిమానాతో పాటు డీమెరిట్ పాయింట్లు కూడా విధిస్తున్నారు. అయితే మ్యాచ్ ఆలస్యానికి కేవలం ఆటగాళ్లనే బాధ్యులను చేయడం తగదని స్టీవార్ట్ అభిప్రాయపడ్డారు. "మ్యాచ్‌ను సమయానికి పూర్తి చేయించడం అంపైర్ల బాధ్యత. మ్యాచ్‌ల మధ్య విరామాలు, ప్రకటనల కారణంగా ఆట ఆలస్యం అవుతోంది. అంపైర్లు కఠినంగా వ్యవహరించకపోవడం వల్లే ఈ సమస్య పెరుగుతోంది" అని ఆయన పేర్కొన్నారు. క్రికెట్ చట్టాల ప్రకారం హెచ్చరికలు, ఐదు పరుగుల పెనాల్టీలు విధించే అధికారం ఉన్నప్పటికీ, అంపైర్లు వాటిని వినియోగించడంలో వెనుకంజ వేస్తున్నారని విమర్శించారు. స్లో ఓవర్ రేట్ ఎదురైన ప్రతిసారీ అంపైర్లకే జరిమానాలు విధిస్తే మ్యాచ్‌లు వేగంగా పూర్తవుతాయని సూచించారు. ఇక ది హండ్రెడ్ లీగ్లో అమలు చేస్తున్న 60 సెకన్ల క్లాక్ విధానాన్ని ఉదాహరణగా చూపిస్తూ, అక్కడ వికెట్ పడిన వెంటనే సమయం లెక్కించడం ప్రారంభమవుతుందని తెలిపారు. బ్యాటర్ సమయానికి సిద్ధంగా లేకపోతే ఐదు పరుగుల పెనాల్టీ విధిస్తారని చెప్పారు. మొత్తంగా మ్యాచ్‌లలో ఆటంకాలు తగ్గించి, ప్రేక్షకులకు వేగవంతమైన ఆట అందించాలంటే అంపైర్లు మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని స్టీవార్ట్ స్పష్టం చేశారు.






## పెళ్లి ఆగింది.. మళ్లీ సినిమాల్లోకి

సినీ పరిశ్రమలో ప్రేమలు, పెళ్లిళ్లు, బ్రేకప్‌లు సాధారణమే అయినప్పటికీ, కొందరి జీవితాల్లో జరిగే పరిణామాలు మాత్రం అభిమానులను ఆశ్చర్యానికి గురి చేస్తుంటాయి. అలాంటి సంఘటననే ఇటీవల హీరోయిన్ నివేదా పేతురాజు జీవితంలో జరిగింది. తెలుగులో తక్కువ సినిమాలే చేసినా, తన అందం మరియు అభినయంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నివేదా పేతురాజు, కెరీర్ ప్రారంభంలో గ్లామర్‌కు దూరంగా ఉండి, కథాపరమైన పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత మాత్రం గ్లామర్ పాత్రల్లో కూడా మెరిసి యువతలో మంచి క్రేజ్ సంపాదించింది. ఇదిలా ఉండగా, కొంతకాలం క్రితం ఆమె తన ప్రియుడిని సోషల్ మీడియా ద్వారా పరిచయం చేస్తూ, త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నట్లు ప్రకటించింది. దీంతో అభిమానులు ఆమె పెళ్లి కోసం ఆసక్తిగా ఎదురుచూశారు. కానీ అనూహ్యంగా పెళ్లి పీటల వరకు వెళ్లిన ఈ సంబంధం మధ్యలోనే ముగిసిపోయింది. బ్రేకప్ తర్వాత సోషల్ మీడియా నుంచి అతనితో ఉన్న ఫోటోలను తొలగించడం ద్వారా ఈ విషయాన్ని పరోక్షంగా తెలియజేసింది. ఈ పరిణామాల అనంతరం కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్న నివేదా పేతురాజు, ఇప్పుడు మళ్లీ తన కెరీర్‌పై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. తిరిగి సినిమాల్లో రాణించాలని నిర్ణయించుకున్న ఆమె, కొత్త కథలు, విభిన్న పాత్రలను ఎంపిక చేసుకుంటూ ముందుకు సాగుతోంది. ఇప్పటికే విశ్వక్ సేన్ నటించిన ధమ్కీ సినిమాలో తన గ్లామర్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్న నివేదా, హీరోయిన్‌గా మాత్రమే కాకుండా సెకండ్ లీడ్ పాత్రల్లో కూడా తన ప్రతిభను నిరూపించుకుంది. మొత్తానికిడ వ్యక్తిగత జీవితంలో ఎదురైన అడ్డంకులను పక్కనపెట్టి, మళ్లీ కెరీర్‌పై ఫోకస్ పెట్టిన నివేదా పేతురాజు, ఇక ముందు మరింత బలంగా తిరిగి రావాలని అభిమానులు ఆశిస్తున్నారు.

## అనన్య నాగళ్ల హాట్ ఫోజులు

తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన అనన్య నాగళ్ల ఒక ప్రముఖ తెలుగు సినీ నటి. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగాన్ని వదిలి, చిన్న చిన్న చిత్రాల ద్వారా సినీ రంగంలోకి అడుగుపెట్టిన ఆమె, 'మల్లేశం' చిత్రంతో కథానాయికగా మంచి గుర్తింపు పొందింది. అనంతరం 'వకీల్ సాబ్', 'పొట్టేల్' వంటి చిత్రాలలో నటిస్తూ గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలతో తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ఇప్పటివరకు పలు చిత్రాలలో పల్లెటూరి అమ్మాయి పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ అందాల తార, ప్రస్తుతం తన శైలి మార్చి గ్లామర్ మోతాదును పెంచుతోంది. ఇటీవల ఆమె తన సామాజిక మాధ్యమ వేదికలో పంచుకున్న ఆకర్షణీయ చిత్రాలు విస్తృతంగా ప్రాచుర్యం పొందుతున్నాయి. ఈ చిత్రాలను చూసి అభిమానులు ముగ్ధులవుతుండగా, యువతలో మంచి ఆదరణ లభిస్తోంది. ప్రస్తుతం అనన్య నాగళ్ల తాజా అందాల ప్రదర్శన నెట్టింట చర్చనీయాంశంగా మారింది.



## సెప్టెంబర్ 2న 'పంజా' రీ రిలీజ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులకు అదిరిపోయే శుభవార్త అందింది. దర్శకుడు విష్ణు వర్ధన్ తెరకెక్కించిన స్టైలిష్ యాక్షన్ ఎంటర్టైనర్ పంజా మరోసారి థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధమవుతోంది. అప్పట్లో విడుదల సమయంలో ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయిన ఈ చిత్రం, తర్వాత కాలంలో మాత్రం కల్ట్ క్లాసిక్‌గా గుర్తింపు పొందింది. పవన్ కళ్యాణ్ స్టైలిష్ లుక్, యాక్షన్ ఎలిమెంట్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కారణంగా ఈ సినిమాకు ప్రత్యేక ఫ్యాన్ బేస్ ఏర్పడింది. ఇప్పుడు అదే చిత్రాన్ని ఆధునిక 4కే టెక్నాలజీతో రీ రిలీజ్ చేయాలని మేకర్స్ నిర్ణయించినట్లు సమాచారం. ప్రతి ఏడాది సెప్టెంబర్ 2న పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన సినిమాలను మళ్లీ విడుదల చేయడం ఆనవాయితీగా మారింది. ఈ క్రమంలోనే 2026 సెప్టెంబర్ 2న 'పంజా'ను గ్రాండ్‌గా విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ సందర్భంగా థియేటర్లలో ప్రత్యేక షోలు, అభిమానుల వేడుకలు ఉండే అవకాశం ఉంది. ఈ చిత్రానికి సంగీతం అందించిన యువన్ శంకర్ రాజా కంపోజిషన్స్ ఇప్పటికీ ట్రెండీగా వినిపిస్తుండగా, సినిమాటోగ్రఫీ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అందుకే కొత్త తరానికి చెందిన ప్రేక్షకుల్లో కూడా ఈ సినిమాపై మంచి ఆసక్తి కనిపిస్తోంది. గతంలో ఖలేజా, ఆరెంజ్ వంటి చిత్రాలు రీ రిలీజ్‌లో భారీ వసూళ్లు సాధించిన నేపథ్యంలో, ఇప్పుడు 'పంజా' కూడా అదే బాటలో సెన్సేషన్ సృష్టిస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. మొత్తానికిడ పవన్ కళ్యాణ్ బర్త్‌డే కానుకగా రాబోతున్న 'పంజా' రీ రిలీజ్ టాలీవుడ్‌లో మరోసారి థియేటర్లకు జోష్ తీసుకురానుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.




## వరుణ్ తేజ్‌కు గాయం.. షూటింగ్‌కు బ్రేక్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ గాయపడిన ఘటన అభిమానుల్లో ఆందోళన కలిగించింది. ప్రస్తుతం ఆయన నటిస్తున్న బరి సినిమా కోసం ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం ప్రకారం, ఫుట్‌బాల్ ప్రాక్టీస్ చేస్తుండగా వరుణ్ తేజ్ కాలికి గాయం అయింది. వెంటనే చిత్ర యూనిట్ అప్రమత్తమై ఆయనను ఆసుపత్రికి తరలించింది. వైద్యులు పరీక్షించి చిన్నపాటి శస్త్రచికిత్స అవసరమని సూచించగా, వెంటనే సర్జరీ నిర్వహించారు. ఆ ఆపరేషన్ విజయవంతంగా పూర్తైనట్లు



వైద్యులు తెలిపారు. ప్రస్తుతం వరుణ్ తేజ్ ఆసుపత్రిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన ఆరోగ్యం స్థిరంగా ఉన్నప్పటికీ, పూర్తిగా కోలుకోవడానికి కొన్ని వారాల పాటు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. దీంతో 'బరి' సినిమా షూటింగ్‌కు తాత్కాలికంగా విరామం ఇచ్చారు. ఆయన పూర్తిగా కోలుకున్న తర్వాతే తిరిగి షూటింగ్ ప్రారంభం కానుంది. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని దర్శకుడు యదు వంశీ రూపొందిస్తున్నారు. యాక్షన్‌తో కూడిన ఈ హై-వోల్టేజ్ డ్రామాలో వరుణ్ తేజ్ కొత్త లుక్‌లో కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాను 2027 సంక్రాంతి సందర్భంగా విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, వరుణ్ తేజ్ గాయంపై సోషల్ మీడియాలో అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. త్వరగా కోలుకోవాలని శుభాకాంక్షలు తెలియజేస్తూ "గెట్ వెల్ సూన్" పోస్టులు పెడుతున్నారు. సినీ ప్రముఖులు కూడా ఆయన ఆరోగ్యం గురించి తెలుసుకుంటూ మద్దతు తెలుపుతున్నారు. మొత్తానికి అనూహ్యంగా జరిగిన ఈ ఘటనతో షూటింగ్‌కు బ్రేక్ పడినా, వరుణ్ తేజ్ కోలుకున్న తర్వాత 'బరి' మరింత ఉత్సాహంతో ముందుకు సాగనుంది.

## భార్యపై కిరణ్ అబ్బవరం భావోద్వేగం

తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించిన యువ హీరో కిరణ్ అబ్బవరం ఇప్పుడు నిర్మాతగా కొత్త అడుగు వేస్తూ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన సమర్పణలో రూపొందిన తిమ్మరాజుపల్లి టీవీ చిత్రం ఏప్రిల్ 17న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. కొత్త ప్రతిభను ప్రోత్సహించాలనే లక్ష్యంతో రూపొందిన ఈ చిత్రంలో సుమారు 25 మందికి పైగా కొత్త నటీనటులను, దర్శకుడు వి. మునిరాజ్‌ను పరిచయం చేస్తున్నారు. ఈ సినిమా ప్రీ-రిలీజ్ వేడుకలో కిరణ్ అబ్బవరం చేసిన వ్యాఖ్యలు అందరినీ భావోద్వేగానికి గురిచేశాయి. "ఈ సినిమా కేవలం ఒక ప్రాజెక్ట్ కాదుడ పల్లెల నుంచి పెద్ద కలలతో వచ్చిన ఎంతోమంది యువ కళాకారుల జీవిత స్వప్నం" అని ఆయన పేర్కొన్నారు. తన కెరీర్ ప్రారంభ దశలో ఎదుర్కొన్న కష్టాలను గుర్తుచేసుకుంటూ, ఈసారి మాత్రం కొత్తవారికి గుర్తింపు రావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ప్రత్యేకంగా తన భార్య రహస్య గోరఖ్ గురించి మాట్లాడిన ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. "నా దగ్గర ఏమీ లేని సమయంలో నన్ను నమ్మి నిలిచింది నా భార్యే. అవకాశాల కోసం తిరిగిన రోజుల్లో కూడా ఆమె నాకు ధైర్యం చెప్పింది. తినడానికి కూడా ఇబ్బంది ఉన్న రోజుల్లో ఇంటి నుంచి భోజనం తీసుకువచ్చి నన్ను ఆదుకుంది. నేను ఒక రోజు హీరో అవుతానని నమ్మి నా



చేతిని పట్టుకుంది" అని చెప్పారు. చిన్న సినిమాగా ఉన్నప్పటికీ నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడలేదని కిరణ్ అబ్బవరం స్పష్టం చేశారు. ముఖ్యంగా సంగీతం, శబ్ద రూపకల్పన ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తాయని తెలిపారు. ఇంటర్వెల్ నుంచి క్లైమాక్స్ వరకు కథ మరింత ఆసక్తికరంగా మారుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా ఈ చిత్ర బృందం కష్టానికి గుర్తింపుగా, వారి కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేక ప్రదర్శనను భారీ తెరపై ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించడం విశేషంగా నిలిచింది. మొత్తంగా చూస్తేడ కష్టాల్లో అండగా నిలిచిన భార్యపై కిరణ్ అబ్బవరం వ్యక్తం చేసిన కృతజ్ఞత భావం అందరినీ కదిలించగా, 'తిమ్మరాజుపల్లి టీవీ' చిత్రంపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది.


Printed, Published and Owned by **GATTU MAHESH,** Printed at **M R PUBLICATIONS,** # 6-3-1880, Vanasthalipuram, Rangareddy, Telangana, 500070, **EDITOR: GATTU MAHESH, JANAMVOICE PUBLICATIONS, 2-80/A,** VILL: ADAVISRIRAMPUR, MANDAL: MUTHARAM, DIST: PEDDAPALLI, TELANGANA , 505184. **RNI NO: TGTEL/26/A0383,** CELL: 8008398069, MAIL ID: honeyassociatesmnt@gmail.com